







# ముగిసిన నామినేషన్లు

## నరసాపురం ఎంపీకి 27 మంది, ఎమ్మెల్యే స్థానాలకు 122 మంది

### నేడు నామినేషన్ల పరిశీలన.. ఉపసంహరణ గడువు 29

సార్వత్రిక ఎన్నికల సమరంలో నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. శుక్రవారం ఎన్నికల అధికారులు ఈ నామినేషన్లను పరిశీలించి నిబంధనలు పాటించని వాటిని తిరస్కరిస్తారు. 29వ తేదీ సోమవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు వుంది. మే 13వ తేదీ పోలింగ్ జరుగుతుంది. ఈ నెల 18వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసి, ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించారు.

**ఎంపీ స్థానానికి 27 మంది**

భీమవరం టౌన్, ఏప్రిల్ 25 : నరసాపురం ఎంపీ స్థానానికి గురువారం 11 మంది అభ్యర్థులు 18 సెట్ల నామినేషన్లను దాఖలు చేసినట్లు పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. వీటితో కలిపి ఇప్పటి వరకు 27 మంది అభ్యర్థులు 39 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఆఖరి రోజు స్వతంత్ర అభ్యర్థులుగా గేదెల లక్ష్మణరావు, గొట్టుముక్కల శివాజీ, ప్రసన్నకుమార్, డి.ఆదినారాయణ, అడబాల శివ, అద్దంకి శేఖర్‌బాబు(దొరబాబు), యాక్షన్ పార్టీ ఫర్ పీపుల్ ప్రోగ్రెస్ నుంచి నాగరాజు రుక్మిణి, రిపబ్లిక్ ఆఫ్ ఇండియా(ఎ) నుంచి గంజి పూర్ణిమ, కాంగ్రెస్ పార్టీ నుంచి బలగం నాయకర్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి కొర్లపాటి బ్రహ్మానందరావునాయుడు, కొర్లపాటి జ్యోతి నామినేషన్లు దాఖలు చేశారు.

**ఎమ్మెల్యే స్థానాలకు 122 మంది**

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గురువారం 67 మంది అభ్యర్థులు 73 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. వీటితో కలిపి ఇప్పటివరకు మొత్తం 122 మంది అభ్యర్థులు 206 సెట్ల నామినేషన్లను సమర్పించినట్లు కలెక్టర్ తెలిపారు. చివరి రోజు.. భీమవరంలో ఎనిమిది మంది ఎనిమిది సెట్లు, తాడేపల్లిగూడెంలో 15 మంది 16 సెట్లు, నరసాపురంలో ఏడుగురు ఏడు సెట్లు, ఆచంటలో ఎనిమిది మంది తొమ్మిది సెట్లు, తణుకులో ఆరుగురు ఏడు సెట్లు, ఉండిలో పది మంది పది సెట్లు, పాలకొల్లులో 13 మంది 16 సెట్లు నామినేషన్లను దాఖలు చేసినట్లు తెలిపారు.

**భీమవరంలో 19 మంది**

- భీమవరంలో గురువారం ఎనిమిది మంది అభ్యర్థులు ఎనిమిది సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించినట్లు ఆర్వో శ్రీనివాసులరాజు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 19 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు.. భారత చైతన్య యువజన పార్టీ నుంచి పి.వడ్డీకాసులు, బహుజన సమాజ్ పార్టీ నుంచి బుగ్గే రేచర్ల, జాతీయ జనసేన నుంచి కడియం రామాంజనేయులు, స్వతంత్ర అభ్యర్థులుగా ముండవ నాగేశ్వరరావు, ఏడుకొండలు, పెంటపాటి మోహనమనోహర్, బహుజనసమాజ్ పార్టీ నుంచి దాసరి కరివర్ధన విజయ ప్రకాశరావు నామినేషన్లు దాఖలు చేశారు.

**ఆచంటలో 13 మంది**

- ఆచంటలో గురువారం తొమ్మిది మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో వి.స్వామి నాయుడు తెలిపారు. వీటితో కలిపి ఇప్పటి వరకు మొత్తం 13 మంది అభ్యర్థులు 26 సెట్ల నామినేషన్‌లు దాఖలైనట్లు చెప్పారు. చివరి రోజు.. కాంగ్రెస్ నుంచి నెక్కంటి సతీష్, వైసీపీ నుంచి చెరుకువాడ రంగనాధరాజు, జై భీమ్‌రావ్ పార్టీ నుంచి కాకి శ్యామ్‌కుమార్, జై భారత్ పార్టీ నుంచి వెలగల శ్రీనివాసరెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా సికిలి రత్నరాజు, గేగి గోపాలకృష్ణ, రామోజు పూర్ణచంద్ర, చికిలే కృష్ణబాబు నామినేషన్లు వేశారు.

**పాలకొల్లులో 19 మంది**

- పాలకొల్లులో గురువారం 13 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.శివనారాయణ రెడ్డి తెలిపారు. వీటితో కలిపి ఇప్పటి వరకు మొత్తం 19 మంది నామినేషన్లు సమర్పించారు. చివరిరోజు.. స్వతంత్ర అభ్యర్థులుగా నల్లి రాజేష్, పాలపర్తి జాన్సన్, జల్ల వాసు, వసంతాల దుర్గ వెంకట సురేష్, కన్నేటి చిన్న అబ్బులు, తానేటి ప్రసాద్, సలాది శ్రీరామమూర్తి, కొటికలపూడి ప్రదీప్, గొల్లమందుల నవీన్ కుమార్, వైసీపీ నుంచి గుడాల శ్రీహరి గోపాలరావు, గుడాల మంగతాయారు, టీడీపీ నుంచి నిమ్మల రామానాయుడు, నిమ్మల సూర్యకుమారి నామినేషన్లు దాఖలు చేశారు.

**నరసాపురంలో 14 మంది**

- నరసాపురంలో గురువారం ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో అంబరీష్ తెలిపారు. వీటితో కలిపి ఇప్పటి వరకు మొత్తం 14 మంది అభ్యర్థులు 25 సెట్ల నామినేషన్‌లను దాఖలు చేశారు. చివరిరోజు.. జనసేన నుంచి బొమ్మిడి నాయకర్, కాంగ్రెస్ నుంచి కానూరి ఉదయ భాస్కర్ కృష్ణప్రసాద్, భారత చైతన్య యువజన పార్టీ నుంచి ఆకుల వెంకటస్వామి, స్వతంత్ర అభ్యర్థులుగా లోకం శ్రీనివాసరావు, గాది రవి, జాతీయ జనసేన పార్టీ నుంచి పాలెంపు సత్యలింగనాయకర్, నవరంగ్ కాంగ్రెస్ నుంచి కొల్లి సత్యనాయకర్ నామినేషన్లు వేశారు.

**తాడేపల్లిగూడెంలో 20 మంది**

- తాడేపల్లిగూడెంలో గురువారం 15 మంది అభ్యర్థులు నామినేషన్‌లు సమర్పించినట్లు ఆర్వో కె.చెన్నయ్య తెలిపారు. వీటితో కలిపి ఇప్పటి వరకు మొత్తం 20 మంది అభ్యర్థులు 28 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా కొట్టు సత్యనారాయణ, కొట్టు సాధనికుమారి, స్వతంత్ర అభ్యర్థులుగా నడపన అచ్యుతకుమార్, ఉంగరాల పద్మ, దేవతి పద్మావతి, బొలిశెట్టి రాజేష్, లంకా ప్రసాద్, గెద్దాడ సువర్ణరాజు, కట్ల గంగరాజు, ఎంవీవీఎల్ నారాయణ, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి పళ్లావఝ్ఝుల శ్రీరామకృష్ణశర్మ, కాంగ్రెస్ నుంచి మార్నిడి శేఖర్, జాతీయ జనసేన పార్టీ నుంచి బూసనబోయిన ఆంజనేయులు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి మేకా వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి బొలిశెట్టి శ్రీనివాస్ నామినేషన్లు సమర్పించారు.

**ఉండిలో 21 మంది**

- ఉండిలో గురువారం పది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. వీటితో కలిపి ఇప్పటి వరకు మొత్తం 21 మంది అభ్యర్థులు 38 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు.. టీడీపీ నుంచి కనుమూరు రఘురామకృష్ణరాజు, కనుమూరు భరత్, భారతీయ చైతన్య యువజన పార్టీ నుంచి గుడిగంట వెంకటేశ్వరరావు, నేషనలిస్ట్ జనశక్తి పార్టీ నుంచి కడియం సూరిబాబు, నీతి నిజాయితీ పార్టీ నుంచి పెనుమత్స శివరామరాజు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి వేటుకూరి వెంకట శివరామరాజు, స్వతంత్ర అభ్యర్థులుగా కూనపరాజు వెంకటకృష్ణంరాజు, దండు సతీష్‌రాజు, గుండె నగేష్, గాజుల శివ నామినేషన్లు వేశారు.


ఉండి ఆర్వోకు నామినేషన్ అందించిన శివరామరాజు

**గెలుపు నాదే : శివ**

ఉండి, ఏప్రిల్ 25 : 'ఉండి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదాలు తీసుకుని నామినేషన్ వేశా. ఈ ఎన్నికలలో నాదే గెలుపు' అని స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామ రాజు అన్నారు. గురువారం అభిమానులతో ర్యాలీగా ఉండి తహశీల్దారు కార్యలయంలోని ఆర్వో సెంటర్‌లో నామినేషన్ వేశారు. 2024 ఎన్నికలు చాలా భిన్నంగా జరుగుతున్నాయన్నారు. అందులో ప్రజల మద్దతు తనకే ఉందన్నారు. ఉండి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, ముదుండి వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు.

**తణుకులో 16 మంది**

- తణుకులో గురువారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో బి.వి.రమణ తెలిపారు. వీటితో కలిపి ఇప్పటి వరకు మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. చివరిరోజు జై భీమ్ రావ్ పార్టీ నుంచి సాకా సురేష్, స్వతంత్ర అభ్యర్థులుగా కరుటూరి సుబ్బారావు, చిట్టూరి సత్యనారాయణ, కూసంపూడి రామచంద్రరావు, కాంగ్రెస్ నుంచి దిర్శిపో రామకృష్ణ నామినేషన్లు వేశారు.

## జిల్లాకు ఆరుగురు ఎన్నికల పరిశీలకులు

భీమవరం టౌన్, ఏప్రిల్ 25 : పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లాకు ఆరుగురు ఎన్నికల పరిశీలకులు విచ్చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం తెలిపారు. ఎన్నికల ప్రత్యక్ష పర్యవేక్షణకు జనరల్, పోలీస్, వ్యయ పరిశీలకులుగా వీరు విధులు నిర్వహిస్తారు. ఎన్నికల ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులను, అర్జీలను రాజకీయ పార్టీలు, పోటీలో వున్న అభ్యర్థులు, సాధారణ ప్రజలు భీమవరం సూర్యనారాయణపురం తమ్మిరాజు నగర్ కాస్మోపాలిటన్ క్లబ్ రూమ్ నంబర్ 303లో ఆయా నియోజకవర్గాల పరిశీలకులను ప్రభుత్వ పనిదినాలలో ప్రతి రోజు ఉదయం పది గంటల నుంచి 11 గంటల వరకు స్వయంగా కలిసి అందజేయవచ్చు. సమస్య తీవ్రతను బట్టి సాధారణ ప్రజలు ఆయా ఫోన్ నంబర్లలో ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు నని తెలిపారు.

- ఎం.దీప, సాధారణ పరిశీలకులు : ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం నియోజకవర్గాలను పర్యవేక్షిస్తారు. ఫోన్ నెంబర్లు 08816-299633, 91824 08687.
- ఎల్.నిర్మలరాజ్, సాధారణ పరిశీలకులు : తణుకు, తాడేపల్లిగూడెం, ఉండి నియోజకవర్గాలను పర్యవేక్షిస్తారు. ఫోన్ నెంబర్లు 08816-299631, 91824 04268.
- పియూష్ శుక్లా, పార్లమెంట్ వ్యయ పరిశీలకులు : అన్ని నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారు. ఫోన్ నెంబర్లు 08816-299632, 91824 06871.
- శైలేష్ కుమార్, పోలీస్ అబ్జర్వర్ : అన్ని నియోజకవర్గాలకు ఎన్నికల పోలీసు పరిశీలకులుగా వ్యవహరిస్తారు. ఫోన్ నెంబర్లు :08816-299636, 91824 01630.
- మోహల్ అగర్వాల్, వ్యయ పరిశీలకులు : ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజక వర్గాల వ్యయ పరిశీలకులు. ఫోన్ నెంబర్లు : 08816-299634, 91824 01630.
- విక్రమాదిత్య మీనా, వ్యయ పరిశీలకులు : తణుకు, తాడేపల్లిగూడెం, ఉండి, భీమవరం నియోజకవర్గాల వ్యయ పరిశీలకుల. ఫోన్ నెంబర్లు : 08816-299635, 91824 04117.

## నేడు షర్మిల రాక

ఏలూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. న్యాయ్ బస్సు యాత్రలో భాగంగా కృష్ణా జిల్లా తిరువూరులో పర్యటన ముగించుకుని శుక్రవారం మధ్యాహ్నం నాలుగు గంటలకు చింతలపూడి బస్ స్టేషన్ సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం దెందులూరు నియోజకవర్గ పరిధిలోని గోపన్నపాలెం చేరుకుని ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. ఇప్పటికే వైసీపీని ఎండ గట్టడంలో షర్మిల దూకుడుగా వ్యవహరిస్తూ నీరసించిన కాంగ్రెస్ కాస్తంత ఊపిరిపోశారు. ఇప్పుడు నియోజకవర్గాల పర్యటనకు రానుండటంతో కాంగ్రెస్‌లో కాస్తంత ఉత్సాహం నెలకొంది. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తమ మద్దతుదారులతో కలిసి నామినేషన్‌లు వేశారు. షర్మిల బస్సు యాత్రకు కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి భాగస్వాములైన సీపీఐ, సీపీఎం శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ పిలుపునిచ్చారు.

**ఎస్ఎస్‌సి, ఇంటర్ (ఏపీఓఎస్ఎస్) పరీక్ష ఫలితాలు విడుదల**

భీమవరం రూరల్, ఏప్రిల్ 25 : గత మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించిన ఎస్ఎస్‌సి, ఇంటర్ (ఏపీఓఎస్ఎస్) పబ్లిక్ పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలకు 913 మంది విద్యార్థులు హాజరవగా వారిలో 180 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లా ఉత్తీర్ణత 19.72గా నమోదైంది. ఇంటర్మీడియట్ (ఏపీఓఎస్ఎస్) పబ్లిక్ పరీక్షలకు 1815 మంది విద్యార్థులకు 897 మంది ఉత్తీర్ణత సాధించి ఉత్తీర్ణతా శాతం 49.42గా ఉందని జిల్లా విద్యా శాఖ అధికారి ఆర్.వెంకటరమణ పేర్కొన్నారు.

## 27న పాలిసెట్ పరీక్ష.. తణుకులో కేంద్రాలు

తణుకు, ఏప్రిల్ 25 : పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులలో చేరే విద్యార్థులకు ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. విద్యార్థులు పరీక్ష రోజున ఉదయం పది గంటలకు పరీక్ష కేంద్రాల వద్ద రిపోర్టు చేయాలని తణుకు ఎస్.ఎం.వి.ఎం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వై.రాజేంద్రబాబు తెలిపారు. తణుకులోని తొమ్మిది సెంటర్ల పరిదిలోని 2 వేల 738 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఎస్ఎంవిఎం పాలిటెక్నిక్‌లో 500, ఎస్‌సిఐఎం జూనియర్ కాలేజిలో 240, ఎస్‌సీఐఎం డిగ్రీ కాలేజినందు160, ఎస్‌కెఎస్‌డి మహిళా కాలేజిలో 400, మాంటిస్సోరి స్కూలులో 350, బాలురున్నత పాఠశాలలో 500, ఎస్‌కెఎస్‌డి జూనియర్ కాలేజిలో 299, శశి హైస్కూలులో 289 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వివరాల కోసం కార్యాలయం ఫోన్ నెంబరు 08819-224087కు సంప్రదించాలని కోరారు.

## మేలో ఆర్జీయూకేటీ నోటిఫికేషన్ !

నూజివీడు టౌన్, ఏప్రిల్ 25: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ ప్రవేశాలకు మే మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో 4,400 సీట్లకు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా నోటిఫికేషన్‌ను మే మొదటి వారంలో విడుదల చేయనున్నట్టు ట్రిపుల్ ఐటీ అధికార వర్గాలు తెలిపాయి. గ్రామీణ స్థాయిలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభా పాటవాలు కనబరిచిన వారి మార్కుల ఆధారంగా అడ్మిషన్‌ల ప్రక్రియను ట్రిపుల్ ఐటీ నిర్వహిస్తోంది. రెండేళ్లుగా ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ అడ్మిషన్లు పూర్తయిన అనంతరం నోటిఫికేషన్, అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించడంతో విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల విషయమై కొంత అయోమయానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆర్జీయూకేటీ అడ్మిషన్‌ల నోటిఫికేషన్‌ను మే మొదటి వారంలో విడుదల చేసేందుకు ఆర్జీయూకేటీ యాజమాన్యం చర్యలు చేపడుతోంది.

## ఆ ఓటు..ఈ ఓటు మాకే..!




### ఇదే కూటమి లక్ష్యం..

- అసెంబ్లీ నియోజక వర్గాల్లో పరస్పర సహకారానికి కో ఆర్డినేటర్లు
- ఇప్పటికే పార్టీల వారీగా ఇన్‌చార్జ్‌ల నియామకం
- ఎంపీ అభ్యర్థులకు ఇదొక పరీక్షే
- ఉమ్మడి పశ్చిమలో ఇప్పటి నుంచే అలర్ట్
- వైసీపీ ఎత్తుగడలకు అంతటా చెక్‌పెట్టే వ్యూహం

పోలింగ్ గడువు ముంచుకొస్తున్న వేళ ముందస్తుగానే పటిష్ఠంగా ఓటరు ముందుకు చేరేందుకు.. వారి మద్దతు పొంది సునాయాసంగా గెలుపొందేందుకు ప్రధాన పక్షాలన్ని ఎవరి ఎత్తుగడ వారు వేస్తున్నారు. ఓటుకు నోటుకు లింక్ పెట్టే క్రమంలో అధికారపక్షం వెంపర్లాడుతోందని, అడ్డగోలు, అడ్డదారి వ్యవహారాలతో ఓట్లు పొందాలని ఆ పార్టీ భావిస్తోందని ఇప్పటికే మిగతా పక్షాలు విరుచుకుపడుతూనే ఉన్నాయి. దీనికి విరుగుడుగా సాధ్యమైనంత మేర ఓటరు మద్దతుకు వీలుగా కూటమి మరో వ్యూహం అమలు చేస్తోంది. ఒకపార్టీ మద్దతుదారులు, అనుకూలురు, ఇంకో పార్టీకి అనుకూలంగా ఓటు బదిలీ చేసే క్రమంలో ఎలాంటి ఒత్తిళ్లు, ఏమరపాటు లేకుండా ముందస్తుగానే కూటమిలోని పార్టీలు సిద్ధమవుతున్నాయి. దీన్ని బ్రేక్ చేసేందుకు వైసీపీ వెంపర్లాడుతోంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల్లో సగానికి సగంపైగా సీట్లను బీజేపీ, జనసేన అభ్యర్థులే పోటీ చేస్తున్నారు. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, పోలవరం, ఉంగుటూరు, కైకలూరు నియోజక వర్గాల నుంచి జనసేన, బీజేపీల అభ్యర్థులు పోటీ పడుతుండగా మిగతా స్థానాల్లో తెలుగుదేశం అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ఈ మూడు పార్టీలు కలయిక ఓట్ల సమయంలోనూ తమకు సానుకూలంగా వర్తించాలని ఆ మేరకు ఓటు బదిలీ జరిగి తీరాలని కూటమి భావిస్తోంది. నామినేషన్‌ల పర్వం నేటితో పూర్తి కానుంది. ఇప్పటి నుంచే ఇక రోజువారీ నియోజకవర్గాల వారీగా ఓటు బదిలీ ప్రక్రియ పకడ్బందీ వ్యూహం అమలు చేయబోతున్నారు. ఆ మేరకు తెలుగుదేశం నియోజకవర్గాల్లో కో ఆర్డినేటర్‌లను నియమించింది. సీనియర్లను అప్రమత్తం చేసింది.



బీజేపీ సైతం ఇదేదారిలో కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. జనసేన తమ పార్టీ అభ్యర్థుల కదలికలు, ప్రచారం గమనిస్తూనే ఉంది. చెక్కు చెదరకుండా ఓటుకోసం వ్యూహం. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి సార్వత్రిక ఎన్నికల్లో 14 అసెంబ్లీ నియోజక వర్గాల్లోనూ, రెండు పార్లమెంటరీ సీట్లలోనూ పోటీకి తలపడుతున్నాయి.

ఏలూరు జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలు, విభజిత పశ్చిమలో మూడు అసెంబ్లీ స్థానాలు మిత్రపక్షాలు తరపున ఉండగా, మిగతా స్థానాల్లో టీడీపీ బల పరిచిన అభ్యర్థులే పోటీ చేస్తున్నారు. ఎప్పుడైతే మూడుపార్టీల మధ్య అధికారికంగా పొత్తు కుదిరిందో ఆనాటి నుంచే ఓటు చెదరకుండా అధికార వైసీపీ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకునేలా కూటమి అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధిపతి పవన్‌కల్యాణ్ ఓటు బదలాయింపు పక్కాగా జరగాలని బహిరంగంగా పిలుపునిచ్చారు. ఉంగుటూరు నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు రెండు లక్షల మందికి పైగానే ఉన్నారు. గత ఎన్నికల్లో ఇక్కడ జనసేన ఒంటరిగా పోటీ చేయగా, 11 వేలకు పైగా ఓట్లు లభించాయి. అక్కడ అదే తెలుగుదేశం పార్టీకి 60వేల ఓట్లు దక్కాయి. ఇప్పుడు ఉంగుటూరు నుంచి జనసేన అభ్యర్థి ధర్మరాజు, టీడీపీ, బీజేపీ మద్దతుతో రంగంలో ఉన్నారు. ఈ రెండు పార్టీల కు చెందిన అనుకూల ఓట్లు జనసేన వైపు మళ్ళాలి. ఇంత పెద్దమొత్తంలో ఓట్ల బదలాయింపు జరగాలంటే పార్టీల మధ్య పరస్పర సహకారం తప్పనిసరి. దీన్నే తెలుగుదేశం గమ నించి తమకు ఉన్న బలాన్ని జనసేన అభ్యర్థికి మళ్ళేలా చూడాలి. బీజేపీ ఇప్పటి నుంచే గ్రామగ్రామాన ఇదే పంథాలో పయనించాలి. అప్పుడే ఉమ్మడి అభ్యర్థి అలవోకగా గెలుస్తారన్న అంచనాల్లో కూటమి ఉంది. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం అసెంబ్లీ స్థానాల్లో జనసేన అభ్యర్థులు బొలిశెట్టి శ్రీనివాస్, భీమవరం అంజిబాబు, నరసాపురం బొమ్మిడి నాయకర్ పోటీ చేస్తున్నందున కూటమిలో టీడీపీ, బీజేపీ ఓట్లు ఆసాంతం బదిలీ కావాల్సిందే. నియోజకవర్గాల వారీగా పరస్పర సమ న్వయంతో పాటు ప్రత్యర్థి పార్టీలు ఎత్తుగడలను చిత్తుచేసేలా అప్రమత్తం కావాల్సిందేనని కూటమి పార్టీల అధినేతలు ఇప్పటికే తమ కేడర్‌కు పిలుపునిచ్చారు. ఎందుకనంటే వచ్చే ఎన్నికల్లో అధికార వైసీపీ ధనబలం, కండబలం ప్రయోగిస్తుందనే అనుమానాలు ఓటర్లలో తాండవిస్తున్నాయి. పోలవరం వంటి నియోజకవర్గాల్లో విస్తీర్ణంలోనూ, ఓటర్ల సంఖ్యలోనూ అత్యధికమే. ఈ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య రెండున్నర లక్షలమందికి పైగానే ఉంది. మారుమూల గిరిజన గ్రామాలు, ముంపు మండలాల్లో కాలి నడకన ప్రయాణించాల్సిన కుగ్రామాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి సంక్లిష్ట నియోజకవర్గంలో రాజకీయ వ్యూహం అక్కడ ఓటర్లను ఒప్పించేదిగా నమ్మించేదిగా ఉండాలనేదే ప్రధాన పక్షాల అంతరంగికం. దీన్నిబట్టే ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెట్టడం తాము వేసే ఎత్తుగడలు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడడం, కూటమి ప్రత్యర్థి పార్టీలను ఒక కంట కని పెట్టి ఉండడం వంటివి పాటించాలంటూ కూటమి నాయకత్వం కేడర్‌ను అప్రమత్తం చేస్తూనే అభ్యర్థులకు ఈ దిశగా మార్గనిర్దేశం చేస్తున్నారు.

**ఎంపీ అభ్యర్థుల సంగతేంటి..?**

ఇటు ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం బల పరిచిన బీసీవర్గాల అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అటు నరసా పురం లోక్‌సభ స్థానంలో బీజేపీ బలపరిచిన అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస వర్మ పోటీలో ఉన్నారు. వీరిద్దరు గెలుపుతో పాటు అత్యధిక మెజార్టీ పొందాలనుకుంటే అధికార వైసీపీ ఎత్తుగడలను ఓవైపు గమనిస్తూనే ఇంకోవైపు కూటమిలోని పార్టీల నుంచి తమకు అనుకూలంగా ఓటు బదిలీ జరిగేలా జాగ్రత్త పడాల్సి ఉంది. కూటమి ఎంపీ అభ్యర్థులు ఇద్దరికి ఇప్పుడు ఇదే అగ్నిపరీక్ష. వీరిద్దరూ ఒకింత సానుకూలత కలిగిన వ్యక్తిత్వంతో ఉండడంతో ఆ మేరకు పార్టీల మధ్య సమన్వయానికి ప్రత్యక్ష సహకారానికి ముందుండి చర్యలు తీసుకుంటున్నారు. నరసాపురంలో శ్రీనివాసవర్మ, ఏలూరులో మహేష్‌కుమార్ ఇద్దరు అసెంబ్లీ స్థానాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులతో పూర్తి సహకారంతో ఉండడంతో వారికి కలిసొచ్చే అంశంగానే కనిపిస్తోంది. అయినా కూడా ఏలూరు, నరసాపురం స్థానాల్లో ఓటుబదిలీ అత్యంత ముఖ్యంగా భావిస్తున్నారు.

**ఓటర్లకు రాజకీయాలు కొత్తేమి కాదు**

'ఇంతకు ముందు ఓటర్లు ఎన్నో ఎన్నికలు చూశారు. రాజకీయ పక్షాల పరస్పర పొత్తులను చూశారు. ఎవర్ని గెలిపించాలో వారికి విజ్ఞత ఉంది. పదేపదే వారికి అవగాహన కలిగించేలా ఇప్పటికే స్థానిక నాయకత్వం ఎలాగో ముందు ఉంది. ఒక్క ఓటుగుర్తు విషయంలో కొన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేకించి ఓటర్లకు గుర్తు చేయాల్సి ఉన్నా ఇప్పటికే ఆ మేరకు ఓటర్లు కూడా చైతన్యవంతమైనట్లే కనిపిస్తోంది'. ఈ తరహా సమాధానమే పార్టీలో ఉన్న సీనియర్ల మధ్య వినబడుతోంది.

## గామన్‌బ్రిడ్జి మూసివేత

**మరోసారి సాంకేతిక లోపంతో మరమ్మతులు**

**వంతెనపై ఒకవైపే వాహన రాకపోకలు**




కొవ్వూరు, ఏప్రిల్ 25: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం-కొవ్వూరు గామన్ బ్రిడ్జి నెల రోజుల వ్యవధిలో మరోసారి మరమ్మతులకు గురైంది. మార్చి 24న గామన్‌బ్రిడ్జి 52వ స్తంభం వద్ద వంతెనకు యాక్షన్ ఇచ్చే బాల్ మరమ్మతులకు గురికావడంతో వంతెనపై ఒకవైపు రాకపోకలను నిలుపుదల చేశారు. మరమ్మతులు పూర్తి చేసి సుమారు నెల రోజుల తరువాత ఏప్రిల్ 23న రెండు వైపులా వాహన రాకపోకలను అనుమతించారు. అయితే ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వైపు వచ్చే మార్గంలో 28వ స్తంభం వద్ద అమర్చిన బేరింగ్‌లో ఎటువంటి ప్రేజర్ రావడం లేదని గుర్తించారు. దీంతో ఈ నెల 26 నుంచి మే 3వ తేదీ వరకు ఈ మార్గంలో వాహన రాకపోకలను నిలుపుదల చేస్తున్నట్టు సమాచారం. బేరింగ్ మార్పు చేయడానికి 10 రోజులపాటు వంతెనపై ఒక మార్గంలోనే వాహన రాకపోకలకు అనుమతించనున్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో నిర్మించిన వంతెనలు వందేళ్లకు పైగా సేవలందించాయి. ఆధునిక సాంకేతికతతో నిర్మించిన గామన్ వంతెనపై రాకపోకలు ప్రారంభించిన పదేళ్లకే మరమ్మతులకు గురి కావడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులు దోచుకున్నదే హద్దుగా నిబంధనలను తుంగలో తొక్కి వంతెనల చెంతనే ఇసుక డ్రెడ్జింగ్ చేసి గోదావరి నదిని గుల్ల చేశారు. గోదావరి తీరం వెంబడి ఏటిగట్టును కొల్లగొట్టి ఏర్పాటు చేసిన ఇసుక ర్యాంపులు, ఇసుక తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీసు, ఎస్ఈబీ అధికారులు సైతం ఫిర్యాదు చేసిన వారిని, ఇసుక తవ్వకాలు, రవాణాను అడ్డుకున్న వారిని అరెస్టులు చేశారు తప్ప ఇసుక అక్రమ తవ్వకాలు, అనధికార డ్రెడ్జింగ్‌ను అరికట్టలేకపోయారు. దీని పర్యవసానమే గామన్ బ్రిడ్జి మరమ్మతులకు కారణమని గోదావరి జిల్లా వాసులు వాపోతున్నారు.

ఉండి నియోజకవర్గంలో ఎన్నో ఎన్ని'కలలు' కొల్లేరు తీరంతో పాటు గోదావరి కాల్వల శివారు ప్రాంతం కావడంతో నీరు పుష్కలమని భావిస్తారు. నియోజకవర్గం మొత్తం గ్రామాలు తాగునీటికి కటకటలాడతాయి. సాగునీటికి రైతులు ఎదురు చూస్తారు. వరదలు, వర్షాలకు మునిగిపోతారు. బ్రిటిష్ కాలంలో నిర్మితమైన యండగండి లాకుల పునర్నిర్మాణానికి జగన్ హామీ ఐదేళ్లలో కొట్టుకుపోయింది. నియోజకవర్గంలో మురుగు డ్రెయిన్లు గ్రామాలను, రైతులను ముంచేస్తున్నాయి. భారీ ఎత్తున ఆక్వా ఉత్పత్తులు అందించే రైతులకు జగన్ విద్యుత్ షాక్ ఇచ్చారు. గ్రామాల మధ్య బ్రిటిష్ కాలంలో నిర్మితమైన ప్రధాన వంతెనలు శిథిలమయ్యాయి. ఆక్వా ఎగుమతుల రవాణా, ప్రయాణికుల రాకపోకలు భయం భయంగా సాగుతున్నాయి.

## ఆక్వా రైతులకు జగన్ షాక్

ఆక్వాజోన్, విస్తీర్ణం పేరుతో ఆక్వారైతులకు ప్రభుత్వం విద్యుత్ షాక్ ఇచ్చింది. సీఎం జగన్ పాదయాత్ర సమయంలో ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామంలో ఆక్వా చెరువులు పరిశీలించి ఆక్వా చెరువులకు యూనిట్ రూ.1.50కే అందిస్తామని ప్రకటించారు. అధికారంలోనికి వచ్చిన తరువాత కొన్నాళ్ళపాటు హామీని అమలుచేసారు. కరోనా తరువాత ఈ నిబంధనను అమలును నెమ్మది సడలించారు. ఆక్వాజోన్‌లో ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుందని, విస్తీర్ణం కేవలం 5 ఎకరాలు ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుందని నిబంధనలు తీసుకువచ్చారు. దీంతో ఆక్వా రైతులకు ఎదురుదెబ్బ తగిలింది. రైతులు సమైక్యమై ఉద్యమించడంతో విస్తీర్ణం10 ఎకరాలకు పెంచారు.







జగన్మాయ

# ఎన్నికలల ఉండి

• సాగునీరు లేదు • ఆక్వా రైతులకు విద్యుత్ షాక్ • పాదయాత్ర హామీలు గాలికొదిలేశారు

### సీఎం హామీలు

- 1885లో ఉండి పంట కాలువపై యండగండిలో నిర్మించిన లాకులు శిథిలావస్థకు చేరాయి. ఏటా వరదలు, వర్షాలకు వేలాది ఎకరాల పంట మునుగుతోంది. లాకుల పునర్నిర్మాణంపై జగన్ హామీ మరిచారు.
- ఆకివీడు నుంచి ఉండి మీదుగా భీమవరం జాతీయ రహదారి విస్తరణ పనులు ఇప్పటికీ మోక్షం లభించడంలేదు.
- కొల్లేరు తీర ప్రాంతమైన ఆకివీడు మండలంలో అన్ని గ్రామాలకు తాగునీరు పూర్తిస్థాయిలో పరిష్కరించలేదు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నిర్మించలేదు.
- వెంకయ్య వయ్యేరు పంట కాల్వను ప్రక్షాళన చేయకపోవడంతో మురుగునీటితోనే దప్పిక తీర్చు కోవాల్సిన పరిస్థితి.
- వరి సేద్యానికి సాగునీరు అందించి, తుఫాన్, అధిక వర్షాలకు వరి చేలలో ముంపునీరు త్వరితగతిన బయటకు వెళ్లేలా కాలువలు, డ్రెయిన్ల పనుల హామీ నెరవేరలేదు.
- కోపల్లె - జక్కరం వంతెన నిర్మిస్తామని పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైంది.
- గోదావరి జలాలను రూ.4 వేల కోట్లతో ప్రత్యేక పైపులైను ద్వారా తాగునీరు హామీ కార్యరూపం దాల్చలేదు.



ఆకివీడులో రోడ్డు పక్కన కొండలా చెత్త



పూడుకుపోయిన మూలలంక బోదె

**ఉండి, కాళ్ళ, ఆకివీడు, ఆకివీడు రూరల్**

ఆకివీడు మండలంలో అన్ని గ్రామాలకు తాగునీరు అందడం లేదు. వెంకయ్య వయ్యేరు పంట కాల్వను ప్రక్షాళన చేయకపోవడంతో మురుగునీటితోనే దప్పిక తీర్చు కోవాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షా కాలం వరి చేలు, నివాస ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. ఆకివీడు పరిధిలో టీడీపీ హయాంలో ఇచ్చిన సెంటున్నర పట్టాలను లబ్ధిదారుల నుంచి వెనక్కి తీసుకొని కొందరికి సెంటు చొప్పున ఇచ్చారు. కొందరికీ స్థలాలు ఇవ్వలేదు. డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణ పరిధిలోని ప్రజలు త్రీవ అవస్థలు పడుతున్నారు. భీమవరం - గుడివాడ రాష్ట్రీయరహదారిపై కోపల్లె వద్ద బొండాడ డ్రెయిన్‌పై బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. కాళ్ళ మండలంలోని అన్ని గ్రామాల నుంచి భీమవరం వైపు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. జువ్వలపాలెం రాష్ట్రీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు, ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. బొండాడ మురుగు కాలువపై జక్కరం - కోపల్లె వంతెన నిర్మాణానికి రూ.12 కోట్లు నిధులు మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో బిల్లుల భయంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేదు. ఉండి మండలంలో దీర్ఘకాలిక ప్రధాన సమస్య యండగండి లాకులు. వరదలు, భారీ వర్షాలకు వేలాది ఎకరాలు ముంపు బారిన పడుతున్నాయి. పాలకులు పునర్ని ర్మాణ పనులు పట్టించుకోవడం లేదు. పంట కాలువలలో గుర్రపుడెక్క, తూడు, చెత్త పేరుకుపోయి సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నాయి. ఆకివీడు మండలంలోని పలు గ్రామాలు మంచినీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నాయి. ప్రధాన మంచినీటి కాలువ వెంకయ్య వయ్యేరు. ఎగువ మండలాలకు ఇది మురుగు కాలువ. వ్యవసాయం, ఆక్వా, గ్రామాలలోని మురుగు నేరుగా కాలువలోకి వదులడంతో మండల ప్రజలకు కలుషిత నీరే దిక్కు.

### బాదుడే.. బాదుడు..

గత ప్రభుత్వ హయాంలో ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్, చెరువు విస్తీర్ణం పరిమితులు లేవు. ఆక్వా చెరువులకు విద్యుత్ సబ్సిడీ అమలు చేశారు. విద్యుత్ టాన్స్‌పార్మర్లు అతి తక్కువ ధరకే అందించారు. గతంలో 25కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రూ. 1.80 లక్షలు కాగా ప్రస్తుతం ఆధర రూ. 3.50 లక్షలు ఉంది. 40, 63కెవి ట్రాన్స్‌ఫార్మర్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆక్వా ఉత్పత్తుల ధరలు అమాంతం పడిపోయాయి. ఫీడ్, సీడ్ ధరలు పెరిగిపోయాయి. నాణ్యతలేని సీడ్, ఫీడ్‌లు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. వైసీపీ పాలనలో ఆక్వా రైతులు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారు, ఆక్వా పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉంది.



### కాల్వ ముంచేస్తుంది

పంట కాలువ గుర్రపుడెక్క, చెత్తతో పూడిపోయింది. తొలగింపు చర్యలు లేక పంటలు నీట మునుగుతున్నాయి. వర్షాలకు వరదలకు కాల్వ గట్లు కొంతమేర దెబ్బతిన్నాయి. వేసవిలో పనులను చేపట్టి పూర్తిచేయాలి. వర్షాకాలం వచ్చిందంటే చాలు వరిపొలాలు ముంపు బారినపడుతున్నాయి. పండించిన పంట వర్షార్పాణం అవుతుంది. రైతులు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

పీవీఎస్ గోపాకృష్ణంరాజు
రైతు, యండగండి

### పంట కాల్వలో కలుషిత నీరు



పంట కాల్వలో వచ్చేది మంచినీరు కాదు. ఆక్వా చెరువుల నీరు కలుస్తోంది. ఆ నీటినే మంచినీటి చెరువులలో నింపి తాగాల్సిన దుస్థితి. పచ్చరంగులో నీరు దుర్వాసన వెదజల్లుతోంది. కాల్వలు తూడు, గుర్రపుడెక్కతో పూడిపోయాయి. వేసవిలో కాల్వ ఎండిపోదు. బురద, ఆక్వా నీటితో బ్యాక్టీరియా పెరిగి రోగాలకు కారణమవుతోంది.

- బొడ్డుపల్లి అప్పనపల్లి, కళింగగూడెం

### తాగు నీటి కోసం ఎదురుచూపులు



పెరుగుతున్న జనాభాకనుగుణంగా మంచినీటి చెరువులు విస్తీర్ణం పెరగడం లేదు. వేసవి కాలంలో నీటిని నిలువ చేసుకోవడానికి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు అత్యవసరం. హామీ బుట్ట దాఖలా అయ్యింది. ఎప్పటి మాదిరిగానే వేసవి వచ్చిందంటే నీటియద్దడి షరా మామూలే. ఇదిలా ఉండగా వర్షాకాలంలో కలుషితమైన నీరే ప్రజలకు దిక్కవుతున్నది.

- నౌకట్ల రామారావు అయిభీమవరం

## మీకు తెలుసా..



### ఇప్పటి వరకు 15 ఎన్నికలు

స్వాతంత్ర్యం వచ్చాక రాష్ట్రంలో ఇప్పటి వరకు 15 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 952లో తొలిసారి ఫిబ్రవరి 10న ఎన్నికలు జరిగాయి. తర్వాత ఇలా..

| | |
|---|---|
| 1957 ఫిబ్రవరి 25 | 1989 నవంబరు 22 |
| 1962 ఫిబ్రవరి 19 | 1994 డిసెంబరు 1 |
| 1967 ఫిబ్రవరి 8 | 1999 సెప్టెంబరు 18 |
| 1972 మార్చి 15 | 2004 ఏప్రిల్ 20 |
| 1978 ఫిబ్రవరి 25 | 2009 ఏప్రిల్ 16 |
| 1983 మే 1 | 2014 ఏప్రిల్ 30 |
| 1985 మే 3 | 2019 ఏప్రిల్ 11 |

16వ సార్వత్రిక ఎన్నికలు మే 13న జరుగనున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1952 నుంచి 2009 వరకు 13 సార్లు ఎన్నికలు జరగ్గా, రాష్ట్ర పునర్విభజన తర్వాత ఏపీలో మూడోసారి ఎన్నికలు జరుగబోతున్నాయి.

- ముదినేపల్లి

## కూటమికి సైకిల్ గుర్తు లేదు

### నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెంలో గ్లాస్, నరసాపురం లోక్‌సభకు కమలం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన 40 ఏళ్ల తర్వాత మూడు నియోజకవర్గాల్లో అసెంబ్లీ, లోక్‌సభ బ్యాలెట్ పత్రాల్లో సైతం సైకిల్ గుర్తు కనబడదు. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కలసి కూటమిగా ఎన్నికల బరిలో దిగాయి. ఆ పార్టీ ఒప్పందం మేరకు నరసాపురం లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి పోటీలో ఉన్నారు. మూడు పార్టీల తరపున అభ్యర్థికి బ్యాలెట్‌లో కమలం గుర్తుతో బరిలో ఉంటారు. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం అసెంబ్లీ స్థానాల్లో కూటమి ఒప్పందం మేరకు జనసేన అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉండడంతో ఆయా అభ్యర్థులకు గ్లాస్ గుర్తు ఉంటుంది. మూడు నియోజకవర్గాల్లో మొత్తంగా రెండు బ్యాలెట్‌లలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల గుర్తు సైకిల్ కనిపించదు. నాలుగు దశాబ్దాల తరువాత తొలిసారిగా ఈ పరిస్థితి కనిపించడంతో ఓటర్లను ఆయా పార్టీలు అప్రమత్తం చేస్తున్నాయి.

- భీమవరం టౌన్

## ఆ బ్యాలెట్‌లో ఏ గుర్తు ఉండదు

### పోస్టల్ బ్యాలెట్‌లో టిక్‌లు పెట్టాలి



పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు గతంలో పేపర్ బ్యాలెట్‌పై పార్టీల గుర్తులు ఉండేవి. ఇప్పుడు ఈవీఎంలపై కూడా గుర్తులు ఉంటున్నాయి. నచ్చిన పార్టీ అభ్యర్థి పేరు వద్ద ఉన్న గుర్తుపై మీట నొక్కాలి. ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రైవేట్ వ్యక్తులు ఓటు వేయవచ్చు. వారికి పోస్టల్ బ్యాలెట్ ఇస్తారు. ఈ బ్యాలెట్‌పై పార్టీల గుర్తులు ఉండవు. కేవలం అభ్యర్థి, పార్టీ పేర్లు మాత్రమే ఉంటాయి. ఇంతకు ముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగే సమయంలో సాధారణ ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పేపర్‌నే ఉద్యోగులకూ ఇచ్చే వారు. ఈవీఎంలు వచ్చాక ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో పాల్గొనే ఇతరులు యంత్రంలో ఓట్లు వేసే అవకాశం లేకపోవడంతో పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ బ్యాలెట్‌పై అభ్యర్థి పేరు, పార్టీ పేరు ముద్రిస్తారు. గుర్తు ఉండదు. బ్యాలెట్‌పై అభ్యర్థి పేరు పక్కన టిక్ పెట్టాల్సి ఉంటుంది.

- ముదినేపల్లి

## ఎక్కువ మంది అభ్యర్థులు ఉంటే..

### రెండో ఈవీఎం వినియోగం



అసెంబ్లీ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ల స్థానంలో ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషిన్‌ను) ఉపయోగిస్తుంటారు. ఒక నియోజకవర్గంలో 16 మంది కంటే ఎక్కువ అభ్యర్థులు పోటీలో ఉంటే రెండు ఈవీఎంలను ఉపయోగించవలసి ఉంటుంది. ఒక ఈవీఎంలో 15మంది అభ్యర్థులు ఒక నోటా కలిపి 16మంది వివరాలు నమోదు చేసుకునే వీలు మాత్రమే ఉంటుంది. అంతకంటే ఎక్కువ మంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంను ఉపయోగించాలి. కైకలూరు నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ ముగిసేసరికి 44 మంది అభ్యర్థులు దాఖలు చేశారు. ఉపసంహరణ తర్వాత కూడా వారంతా పోటీలో ఉంటే రెండు ఈవీఎంలు అవసరమని స్థానికంగా చర్చనీయంశంగా మారింది. మొదటి ఈవీఎంలో 16 మంది రెండో ఈవీఎంలో 16మంది అంతకంటే ఎక్కువ ఉంటే మరో ఈవీఎంలో అభ్యర్థుల వివరాలు నమోదు చేస్తారు. ఏ పోలింగ్ బూత్‌లో అయిన ఎన్నికల ప్రక్రియ మొదలైన తరువాత ఈవీఎం మొరాయిస్తే అప్పటివరకు నమోదైన వివరాలను సీజ్ చేసి రెండో ఈవీఎంను ఉపయోగిస్తారు.

- కైకలూరు

## అమ్మ.. నాన్న.. కుమారుడు..

### ముగ్గురూ మంత్రులే..



మాగంటి రవీంద్రనాథ్ చౌదరి, వరలక్ష్మీదేవి, మాగంటి బాబు

ఒకే కుటుంబంలో అమ్మ, నాన్న, కుమారుడు ముగ్గురూ రాష్ట్ర మంత్రులుగా పని చేశారు. దెందులూరు నియోజకవర్గంలో మాగంటి కుటుంబం అరుదైన గుర్తింపు పొందింది. 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి దెందులూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన మాగంటి రవీంద్రనాథ్ చౌదరి దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రిగా పని చేశారు. ఆయన మంత్రి పదవిలో ఉండగానే ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన మరణానంతరం 1991లో జరిగిన ఉప ఎన్నికలో మాగంటి రవీంద్రనాథ్ చౌదరి సతీమణి వరలక్ష్మీదేవి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి అయ్యారు. వారి తనయుడు మాగంటి వెంకటేశ్వరరావు(బాబు), 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రెండేళ్ల తర్వాత మంత్రి వర్గంలో చిన్ననీటి పారుదల శాఖ మంత్రి అవకాశం దక్కింది. ఒకే కుటుంబం, తండ్రి, తల్లి, కుమారుడు మంత్రులు కావడం విశేషం.

- పెదవేగి

## ఎన్నికల ఆఫర్



### ఓటు వేస్తే.. ఉచిత వైద్యం

**ఏలూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రి ఆఫర్!!**

ఎన్నికల్లో ఓటింగ్‌ను ప్రోత్సహించేందుకు ఏలూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రి వినూత్న ప్రయత్నం చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13న పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న వారికి తమ ఆస్పత్రిలో ఆరు నెలలపాటు ఉచిత వైద్యాన్ని అందజేస్తామని ప్రకటించింది. ఆరు నెలల్లో కన్సల్టేషన్ ఫీజులేకుండానే వైద్య సలహాలు ఇస్తామని ఏలూరు ఎస్ఆర్ పేటలోని సిద్ధార్థ ఈఎన్‌టీ, డెంటల్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ సీఎస్.రాజు తెలిపారు. పోలింగ్‌రోజున ఓటు హక్కు వినియోగించుకున్నట్టు ఓటరు వేలిపై సిరా గుర్తును చూపించి ఉచిత వైద్యవైద్యాన్ని పొందవచ్చునని వివరించారు. సాధారణంగా పండుగలు, నూతన సంవత్సరం తదితర ప్రత్యేక సందర్భాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు కస్టమర్లను ఆకర్షించేందుకు ఆఫర్లు ఇస్తారు. వీటికి భిన్నంగా సాధారణ ఎన్నికల్లో ఓటింగ్‌ను పెంచేందుకు ఉచిత వైద్యాన్ని ఆఫర్ చేయడం ఇదే మొదటి సారి అని బావిస్తున్నారు. ఓటుహక్కుని వినియోగించుకునే వారిసంఖ్య తగ్గిపోతున్న నేపథ్యంలో సమాజంలో బాధ్యత గల పౌరునిగా ఓ వైద్యుడు ముందుకు వచ్చి ఈ విధంగా ఆఫర్ చేయడం అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు. డాక్టర్ సి.ఎస్.రాజు హాస్పిటల్స్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఏపీ శాఖ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

- ఏలూరు అర్బన్



స్వేచ్ఛగా ఓటేయండి

పేరుపాలెంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీస్ అబ్జర్వర్ సిన్హా

### పోలీస్ అధికారుల సందర్శన

మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పోలీస్ అధికారులు పరిశీలించారు. గ్రామస్థులు, స్థానికులతో మాట్లాడి స్వేచ్ఛగా ఓటేయాలని సూచించారు. పోలీస్ అబ్జర్వర్ సైలేష్ కుమార్ సిన్హా, డీఎస్పీ జి.శ్రీనివాసరావు, సీఐ గోవిందరాజు, కాశీచరణ్, రామాంజి, ఎస్ఐలు వెంకటరమణ, గుర్రయ్య పేరుపాలెం, కేపీపాలెం, ముత్యాలపల్లి తదితర గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు సందర్శించారు. స్థానికులు, అధికారులతో ప్రశాంత పోలింగ్‌పై సమీక్షించారు.

- మొగల్తూరు



గెలిపించు తల్లీ..

రాట్నాలమ్మకు మొక్కుతున్న చింతమనేని ప్రభాకర్

### బీ ఫామ్‌కు చింతమనేని పూజలు

దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన చింతమనేని ప్రభాకర్ సతీ సమేతంగా గురువారం పలు ఆలయాల్లో పూజలు చేశారు. రాట్నాలమ్మను దర్శించుకుని టీడీపీ బీ ఫామ్‌కు ప్రత్యేక పూజలు చేయించారు. ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి, హనుమాన్ జంక్షన్ అభయాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మ తల్లిని దర్శించుకుని బీ ఫామ్‌కు పూజలు చేయించారు. ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుకున్నారు.

- పెదవేగి



# పేదల కడుపు నింపిన నామినేషన్

**అభ్యర్థుల జన సమీకరణ**
**సొమ్ములతోపాటు విందు భోజనం**

ఎన్నికల బరిలో దిగుతున్న అభ్యర్థులు బల ప్రదర్శన ప్రయత్నాలు కొందరి పేదల కడుపు నింపింది. ఉంగుటూరు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా జన సమీకరణకు భారీగా డబ్బులు పంపిణీ చేశారని కొందరు ఖుషీ అయ్యారు. అభ్యర్థితో పాటు నామినేషన్ ర్యాలీలో వెళ్లినవారికి పురుషులకు రూ. 600, మహిళలకు రూ.400 చొప్పున ఇచ్చారని కొందరు ఉబ్బితబ్బిబ్బు అయ్యారు. సొమ్ములు దండిగా వస్తున్నాయని జనం ఎగబడ్డారు. ఇంతేకాకుండా మోటారు సైకిల్‌కు రానుపోను రూ.200, ఆటోలకు రూ.వెయ్యి చొప్పున ఇచ్చి జన సమీకరణ చేశారని వెళ్లిన కొందరు ఆనందపడిపోతున్నారు. నియోజకవర్గ స్థాయిలో డ్వాక్రా యానిమేటర్లు, ఉపాధి హామీ సిబ్బంది సహకారంతో జనం తరలింపులో సేవలందించారని సమాచారం. నామినేషన్ కార్యక్రమం నిర్వహణ నిమిత్తం ఒక్కో గ్రామానికి రూ.40 వేలు గ్రామ స్థాయి నేతలకు బట్వాడా జరిగిందని కొందరు చెబుతున్నారు. ముందుగా సొమ్ములు అందించారని కార్యకర్తలే బాహటంగా వెల్లడిస్తున్నారు. ఇదిలాఉండగా నామినేషన్ కార్యక్రమానకి బయలుదేరిన కార్యకర్తలకు ఎండవేడిమి చుర్రుమనిపించింది. ఎండవేడిమి తట్టుకోలేని కొందరు సొమ్ములు ముందుగానే అందడంతో సగంలో వెనుదిరగడం కొసమెరుపు.

### కోడి కూర.. పండుగొప్ప పులుసు..

నామినేషన్ కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలకు విందు భోజనమే. నారాయణపురం సమీపాన ఖాళీ స్థలాలలో కోడికూర, పండుగప్ప పులుసు, మటన్ కూరతో పసందైన భోజనం ఏర్పాటు చేశారు. ఉక్కపోత వాతావరణంలో రుచికరంమైన భోజనం పూర్తిగా తినలేకపోయారు.

ఉంగుటూరు మండలం నుంచి కూడా వైసీపీ నేతలు, కార్యకర్తలు భారీగా జన సమీకరణ చేశారు. నామినేషన్ దాఖలుకు ఆఖరి రోజు పలువురికి తాత్కాలిక ఉపాధి లభించినట్లయింది, ర్యాలీగా వెళ్లిన వారికి భారీగానే సొమ్ములు ముట్టాయి. ఆటోలు, మోటార్ వాహనాలపై తరలించారు. ఒక్కొక్కరికి రూ.200 నుంచి రూ.500 వరకు ముట్టజెప్పినట్లు పలువురు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ముట్టచెప్పిన మొత్తం మారింది. ఎన్నికల వేళ.. ఎండలో పనులకు వెళ్లలేని కొందరి కొంత మొత్తం అందినా ఎన్నికల అధికారులు ఈ ఖర్చును ఎలా చూస్తారో..!

- ఉంగుటూరు



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ జనరల్ ఎలక్షన్ పోలీస్ అబ్జర్వర్ శైలేష్ కుమార్ సిన్హా

## ప్రజలు స్వేచ్ఛగా ఓటెయ్యాలి

### ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ శైలేష్ కుమార్ సిన్హా

భీమవరం క్రైం, ఏప్రిల్ 25 : నిబంధనలకు అనుగుణంగా పాదర్శకత, నిష్పక్షపాతంతో ఎన్నికల విధులు నిర్వహించాలని స్పెషల్ జనరల్ ఎలక్షన్ పోలీస్ అబ్జర్వర్ శైలేష్ కుమార్ సిన్హా అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జిల్లా పోలీస్‌శాఖ తీసుకుంటున్న ముందస్తు చర్యలను కొనియాడారు. జిల్లాలో చేపట్టిన చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్పీ వివరించారు. ప్రజలు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావల్సి వస్తుందని హెచ్చరించారు. ఈవీఎంల రవాణా, భద్రతా విషయాలు, సిబ్బందికి సదుపాయాలు, ఇతర విషయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) భీమారావు, డీఎస్పీలు మూర్తి, నారాయణస్వామిరెడ్డి, శ్రీనివాసరావు, పశ్చిమ గోదావరి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, సెబ్ డీఎస్పీ వెంకట నారాయణ, దిశా డీఎస్పీ నున్న మురళీకృష్ణ, సీసీఎస్ యుగంధర్‌బాబు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ తిలక్, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పరకాల ప్రభాకర్

## ఆలోచించి ఓటు వెయ్యండి

### 'సంక్షోభంలో రాజ్యాంగం, ఆర్థిక, రాజకీయ మూలాలు' సదస్సులో పరకాల

తణుకు, ఏప్రిల్ 25 : దేశంలో ప్రజా జీవనాన్ని, ప్రజాస్వామ్యాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన మోదీ నిర్వాకాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అప్రమత్తతో, ఆలోచించి ఓటు వేయాలని ప్రముఖ రాజకీయ, సామాజిక, ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ పిలుపునిచ్చారు. 'సంక్షోభంలో రాజ్యాంగం, ఆర్థిక, రాజకీయ మూలాలు' అనే అంశంపై తణుకులో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. 'దేశంలో నిరుద్యోగం ఎన్నడూ లేనంత తీవ్రస్థాయిలో పెరిగింది. విద్యావంతుల్లో నిరుద్యోగిత 83 శాతం ఉంది. 35 వేల రైల్వే ఉద్యోగాల కోసం కోటి 30 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. భారతీయ నిరుద్యోగులు ప్రాణాలకు తెగించి ఇజ్రాయిల్, ఉక్రెయిన్ దేశాలలో జరుగుతున్న యుద్ధాలలో ఉద్యోగులుగా వెళ్ళడానికి సిద్ధపడుతున్నారు. అయినా ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. పెరిగే ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. మూడు నెలల్లో కిరాణా సరుకుల బిల్లు చూస్తే మనకు తెలిసిపోతుంది. పెట్రోలు, డీజిల్ గ్యాస్ ధరల భారం అందరికీ అనుభవంలో వున్నదే. అన్నదాతలకు నోటితో రెట్టింపు ఆదాయమంటూనే వారి శాంతియుత ఆందోళనలపై కర్కశంగా వ్యవహరించింది. ప్రజాస్వామ్య విలువలైన రాజ్యాంగ నిబద్ధత, ప్రశ్నించే పౌరస్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛలకు తిలోదకాలిచ్చారు' అని ఆందోళన వ్యక్తం చేశారు. అల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఉభయ గోదావరి జిల్లాల కార్యదర్శి కామన మునుస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో, దారి దీపం పత్రిక ప్రధాన సంపాదకులు డీవీవీఎస్ వర్మ, సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవ స్థాపక అధ్యక్షుడు మురళికుమార్ మాట్లాడారు. వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు,ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఎవరికి పోలవరం

జిల్లాలోనే అతిపెద్ద రిజర్వుడు నియోజకవర్గం. ఐదు మండలాలు ఉన్న ఈ నియోజకవర్గంలో విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు కలవడంతో అతి పెద్ద నియోజక వర్గంగా మారింది. ఎక్కడో మారుమూలన ఉండే ఈ నియోజకవర్గంలో పోలవరం ప్రాజెక్ట్ రావడంతో జాతీయంగా ఎంతో పేరుప్రఖ్యాతలు వచ్చాయి. అటవీ ప్రాంతం, కొండలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం. ఏజెన్సీ ప్రాంతం కావడంతో నియోజకవర్గ పరిధిలో బుట్టాయిగూడెం మండలం కోట రామచంద్రపురంలో ఐటీడీఏను ఏర్పాటు చేశారు.

- పోలవరం

### అతిపెద్ద రిజర్వుడు నియోజకవర్గం
### గోదావరి అందాలు సొంతం
### పోలవరం ప్రాజెక్టుతో ప్రపంచ ఖ్యాతి
### ఆవిర్భావం నుంచి టీడీపీ కంచుకోట

ప్రసిద్ది గాంచిన పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి, మహానందీశ్వర స్వామి, పాపికొండల పేరంటాలపల్లి శివక్షేత్రం, గండి పోశమ్మ ఆలయం ఇతర ప్రసిద్ది గాంచిన ఆధ్యాత్మిక దేవాలయాల కొలువు ఆధ్యాత్మికత ప్రపంచానికి నెలవు పోలవరం. అంతేకాదు ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే ప్రపంచలోనే రెండవ భారీ జాతీయ ప్రాజెక్టు , పాపికొండల నడుమ వయ్యారంగా వంపులు తిరిగి నడిచొస్తున్న పల్లెపడుచులా గోదావరి, సహజ సిద్ద ప్రకృతి వనాల కనువిందు పర్యాటకుల మనసుల్ని కట్టిపడేసే సౌందర్యం పోలవరం సొంతం. ఈ ప్రాంతంలో వరి, మొక్కజొన్న, అరటి, పత్తి, అపరాల పంటలు పండిస్తారు. పోలవరం ప్రాజెక్టులో గత ప్రభుత్వ పాలనలో సుమారు 6 వేల మంది కార్మికులకు ఉపాధి లభించింది. టీడీపీ ఆవిర్భావం తర్వాత 1985లో తొలిసారి టీడీపీ అభ్యర్థి మొడియం లక్ష్మణరావు నియోజకవర్గంలో టీడీపీ విజయకేతనం ఎగురవేసి 40,723 ఓట్లతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1989 లో బాడిస దుర్గారావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. ఆ తర్వాత టీడీపీ తరఫున 1994 లో పూనెం సింగన్నదొర, 1999లో వంకా శ్రీనివాసరావు, 2014లో మొడియం శ్రీనివాసరావు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 1972 నుండి 2019 వరకూ జరిగిన 11 ఎన్నికల్లో పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా టీడీపీ నాలుగుసార్లు, జాతీయ కాంగ్రెస్ 5 సార్లు, ఒకసారి ఇండిపెండెంట్ గెలుపొందారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాల విభజన అనంతరం పోలవరం ఏలూరు జిల్లాకు మారుమూల గ్రామంగా మారింది. టీడీపీ ఆవిర్భావం నుంచి టీడీపీకి కంచుకోటగా ఉన్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తర్వాత ప్రాజెక్టు ఎగువ గ్రామాలను ఇతర జిల్లాలకు, మండలాలకు తరలింపు, పంచాయతీల విలీనం వలన కొంత మేర బలహీన పడినా స్థానిక టీడీపీ నేతల కృషితో మళ్ళీ బలం పుంజుకుంది.

పోలవరం నియోజకవర్గం ఏలూరు జిల్లాలో ఉంది. నియోజకవర్గంలో పోలవరం, కొయ్యలగూడెం, టి.నర్సాపురం, బుట్టాయిగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి ఏడు మండలాలున్నాయి. వీటిలో రాష్ట్ర విభజనలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు ఏలూరు జిల్లాలో కొత్తగా కలిశాయి.

### నాటి ప్రోలవరమే నేటి పోలవరం

పోలవరం గ్రామం ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడేనికి 55 కిలోమీటర్ల దూరంలో గోదావరి తీరాన ఉంది. పోలరాజులు పరిపాలించిన కారణంగా పోలవరంగా పిలవబడేది కాలక్రమేణా పోలవరంగా మారింది. ఈ ప్రాంతం ముసునూరు నాయకులు ఆధీనంలో ఉండేది. ముసునూరి పోలయ్య 1330లో పోలవరం గ్రామాన్ని బ్రాహ్మణులకు దానం చేశారు. పాపికొండలు, పోలవరం ప్రాజెక్టు పోశమ్మగండి, పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి, మహానందీశ్వరస్వామి, పేరంటాలపల్లి శివక్షేత్రం పోలవరం మండలంలో ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1955 సంవత్సరంలో పోలవరం, బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి మండలాలతో జనరల్ నియోజకవర్గంగా ఏర్పడింది.

### 1967లో ఎస్టీ నియోజకవర్గంగా మార్పు

1955 సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో భారతీయ జాతీయ కాంగ్రెస్ పార్టీ నుండి పునులూరి కోదండరామయ్య భారతీయ కమ్యూనిస్టు పార్టీకి చెందిన సంకు అప్పారావు మీద విజయం సాధించి మొదటి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత 1962 సంవత్సరంలో కరాటం బాబూరావు ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా గెలుపొందారు. జనరల్ నియోజకవర్గంగా ఉన్న పోలవరం 1967లో షెడ్యూల్ తెగల ఎస్టీ నియోజకవర్గంగా మార్పు చెందింది. షెడ్యూలు తెగల నియోజకవర్గంగా మారిన తర్వాత మొట్ట మొదటి ఎమ్మెల్యే కెఆర్ రెడ్డి. 1955 నుంచి 2009 వరకూ నాలుగు మండలాలతో ఉన్న నియోజకవర్గంలోకి తీగల నరసాపురం మండలాన్ని చేర్చారు.

| నియోజకవర్గం : పోలవరం | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2,52,592 |
| పురుషులు | 1,22,201 |
| మహిళలు | 1,33,380 |
| ఇతరులు | 11 |

### ఆహ్లాదాన్ని పంచే పాపికొండలు



పర్యాటకులకు ఆహ్లాదం, మానసిక ఉల్లాసాన్ని కలిగించే పాపికొండలు ఇక్కడే ఉన్నాయి. గోదావరి నదిపై కలల అలలపై తేలియాడుతూ బోటు ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎత్తైన పాపికొండలు వాటి నడుమ మెలికలు తిరిగి ప్రవహిస్తున్న గోదావరి, నదికి ఇరువైపులా పచ్చని తివాచీ పరిచినట్లుండే ప్రకృతి వనాలు. పాపికొండల జాతీయ పార్కులో స్వేచ్ఛగా సంచరించే వన్యమృగాలు వీట న్నింటిని స్వయంగా వీక్షించి అనుభూతి పొందితే చాలు అని ప్రతి రోజు పర్యాటకులు పోలవరం వచ్చి పాపికొండల విహార యాత్రకు వెళుతుంటారు.

| సంవత్సరం | విజేత | పార్టీ | ప్రత్యర్థి | పార్టీ | ఆధిక్యం |
|---|---|---|---|---|---|
| 1955 | పసులూరి కోదండరామయ్య | కాంగ్రెసు | సంకు అప్పారావు | సీపీఐ | 492 |
| 1962 | కరాటం బాబూరావు | సీపీఐ | పోతన అప్పారావు | కాంగ్రెసు | 1874 |
| 1967 | కొండమొదల రామిరెడి | కాంగ్రెసు | ఎ.సంకురుడు | సీపీఐ | 13,544 |
| 1972 | కణితి రాములు | కాంగ్రెసు | తెల్లం బొజ్జిదొర | జనత | 27,136 |
| 1978 | రసపుత్ర నాగభూషణం | కాంగ్రెసు(ఐ) | మొడియం లక్ష్మణరావు | జనత | 24,399 |
| 1983 | మొడియం లక్ష్మణరావు | ఇండిపెండెంట్ | పూనెం సింగన్నదొర | కాంగ్రెసు | 9617 |
| 1985 | మొడియం లక్ష్మణరావ | టీడీపీ | ఆర్.లక్ష్మీనారాయణ | కాంగ్రెసు | 16,128 |
| 1987 | బాడిస దుర్గారావు | కాంగ్రెసు | పూనెం సింగన్నదొర | టీడీపీ | 4,324 |
| 1989 | బాడిస దుర్గారావు | కాంగ్రెసు | తెల్లం చిన్నవడ్డీ | టీడీపీ | 2,814 |
| 1994 | పూనెం సింగన్నదొర | టీడీపీ | బాడిస దుర్గారావు | కాంగ్రెసు | 32,198 |
| 1999 | వంకా శ్రీనివాసరావు | టీడీపీ | బాడిస దుర్గారావు | కాంగ్రెసు | 24 |
| 2004 | తెల్లం బాలరాజు | కాంగ్రెసు | సున్నం బుజ్జి | టీడీపీ | 18,842 |
| 2009 | తెల్లం బాలరాజు | కాంగ్రెసు | పూనెం సింగన్నదొర | టీడీపీ | 5,664 |
| 2014 | మొడియం శ్రీనివాసరావు | టీడీపీ | తెల్లం బాలరాజు | వైసీపీ | 15,720 |
| 2019 | తెల్లం బాలరాజు | వైసీపీ | మొడియం శ్రీనివాసరావు | టీడీపీ | 42,070 |

### మణిహారం..పోలవరం ప్రాజెక్టు

పోలవరానికి మణిహారం పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పోలవం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఎంతో మంది కార్మికులు ఉపాధి పొందారు. ప్రపంచంలో నిర్మితమైన అతి భారీ ప్రాజెక్టులలో రెండవదిగా పేరుగాంచింది. అతి తక్కువ వ్యవధిలో కాంక్రీట్ నిర్మాణం చేసినందుకు రెండు సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకు ఎక్కింది. కుడి కాలువ ద్వారా కృష్ణా అనుసంధానం జరిగి రాయలసీమ వరకూ సాగునీరు తాగునీరు అందించి లక్షల ఎకరాలు సాగులోకి తెచ్చింది. ఎడమ కాలువ ద్వారా విశాఖపట్టణ పరిశ్రమలకు సాగు తాగునీటి సరఫరా చేయనుంది. రాష్ట్రానికి విద్యుత్ సమస్య తీర్చేందుకు 960 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసే పవర్ ప్రాజెక్టు నిర్మాణ దశలో ఉంది. పోలవరం ప్రాజెక్టు ప్రపంచ పర్యాటకులకు రానున్న రోజుల్లో అత్యద్భు కట్టడంగా కనువిందు చేయనుంది.

### ప్రసిద్ధ శైవక్షేత్రాలకు నిలయం

పోలవరం పేరు చెబితే ఆధ్యాత్మికతకు నెలవుగా వేరే చెప్పనవసరం లేదు. గోదావరి నది మధ్యలో స్వయంభువుగా వెలసిన పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయం, పోలవరం ప్రాజెక్టు దిగువ కాపర్ డ్యాం సమీపంలో ఉండే మహానందీశ్వరస్వామి ఆలయం, ఎగువ కాపర్ డ్యాంకి సమీపంలో ఉండే గండి పోశమ్మ ఆలయం, పాపికొండల సమీపంలో పేరంటాలపల్లి శివక్షేత్రం చెప్పకోదగ్గ ఆధ్యాత్మిక కేంద్రాలు. రాష్ట్రంలో నలుమూలల నుంచి ఏటా 5 లక్షల మందికి పైగా భక్తులు మహాశివరాత్రి సందర్భాల్లో పట్టిసీమ శివక్షేత్రాన్ని దర్శించుకుంటారు. గండి పోశమ్మ ఆలయానికి నిత్యం భక్తులు ఉభయ గోదావరి జిల్లాల నుంచి మొక్కు బడులు తీర్చుకుంటారు. పట్టిసీమ నుంచి పాపికొండల వరకూ గోదావరి నదికి ఇరువైపులా ప్రతిచోటా శివలింగాలు దర్శనమిస్తాయి.



### ప్రచార సిత్రం..



## ప్రచారంలో పిల్లలు సందడి

ఏ కార్యక్రమంలో అయిన పిల్లలు పాల్గొంటే ఆ సరదాయే వేరు. ప్రస్తుతం పిల్లలకు వేసవి సెలవులు ఇచ్చారు. ఇప్పుడసలే ఎలక్షన్ సీజన్.. ప్రచారం హోరెత్తుతోంది. ఇంకేముంది.. పిల్లలకు బోల్డంత ఆటవిడుపు దొరికింది. వేసవి గ్రామాల్లో వివిధ పార్టీల ప్రచారంలో జెండాలు గుర్తులు పట్టుకుని సందడి చేస్తున్నారు. తమ తల్లిదండ్రులు ఏపార్టీ వారన్నదానితో సంబంధం లేకుండా తమకు నచ్చిన పార్టీ వైపు తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నారు. పిల్లలు తోడవడంతో పెద్దల్లో ఉత్సాహం మరింత పెరుగుతోంది. గురువారం తీపర్రులో జరిగిన ప్రచారంలో పిల్లలు ఇలా జెండాలు పట్టుకున్నారు.

- పెరవలి

## చింతలపూడి టీడీపీ అభ్యర్థికి లీగల్ నోటీసు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 25 : ఏలూరు జిల్లా చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ నామినేషన్ పత్రాల్లో వాస్తవాలను దాచిపెట్టి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆయన నామినేషన్ తిరస్కరించాలని లీగల్ నోటీసు పంపించారు. ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా, ఎన్నికల అధికారులకు లింగపాలెం మండలం జీలకర్రగూడెంకు చెందిన రిటైర్డ్ ఎంఈవో ధర్మరాజు తన న్యాయవాది జి.రొనాల్డ్‌రాజ్‌తో గురువారం నోటీసు పంపించారు. రోషన్‌కుమార్ అమెరికాలో తన భార్యతో పాటు ఉద్యోగం చేస్తూ గ్రీన్‌కార్డు పొందారని ఆయనకు అక్కడ బ్యాంక్ ఖాతా, ఆస్తులు, అప్పులు, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ కాంటాక్టు వివరాలు, వీసా, బ్యాంకు డిపాజిట్లు వంటి వివరాలను నామినేషన్ పత్రాల్లో పేర్కొనలేదని ఉద్దేశ్యపూర్వకంగానే ఆయన ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని, ఎన్ఆర్ఐలు ఇక్కడ ఓటర్ల జాబితాలో నమోదు అవ్వాలంటే 6ఎ ఫారమ్ కింద పేరు నమోదు చేయించుకోవాలని ఎన్నికల నిబంధనలు అతిక్రమించారని ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని లీగల్ నోటీసులో పేర్కొన్నారు



## ఒకే పేరుతో నామినేషన్లు



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 25: వైసీపీ కుట్ర రాజకీయాలకు తెర తీసింది. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థికి ఓట్లు వేసేవారిని గందరగోళంలో పడేసేందుకు అస్త్రాలను సిద్ధం చేసింది. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్‌లు సమర్పించారు. అభ్యర్థుల పేర్లు ఉన్నవారితో నామినేషన్లు వేయిస్తోందని ఇది అధికార పార్టీ వైసీపీ కుట్రలో భాగమేనని పలువురు విమర్శిస్తున్నారు. గురువారం భారీగా తాడేపల్లిగూడెంలో 16 నామినేషన్‌లు సమర్పించారు. జనసేన అభ్యర్థిగా పోటీలో ఉన్న బొలిశెట్టి శ్రీనివాస్ పేరును పోలిన అభ్యర్థి నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున బొలిశెట్టి శ్రీనివాస్ నామినేషన్ వేశారు. అదేవిధంగా జనసేన పార్టీ పేరును పోలిన ఉంగుటూరు జాతీయ జనసేన పార్టీ తరపున అభ్యర్థిగా బూసనబోయిన ఆంజనేయులు నామినేషన్ దాఖలు చేశారు.

### నరసాపురంలో ముగ్గురు నాయకర్‌లు

**నరసాపురం** : నరసాపురం అసెంబ్లీ స్థానానికి మొత్తం 14 మంది అభ్యర్థులు 25 సెట్ల నామినేషన్లు వేశారు. వీరిలో నాయకర్‌ల పేర్లపై ముగ్గురు అభ్యర్థులు ఉన్నారు. జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌తో పాటు జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా పాలెపు సత్యలింగ నాయకర్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొల్లి సత్య నాయకర్‌లు ఉన్నారు. వీరిలో పాలెపు సత్యనాయకర్ స్వస్థలం కాకినాడ పట్టణం కాగా, కొల్లి సత్యనాయకర్ స్వస్థలం నరసాపురం పట్టణంలోని 3వ వార్డుకి చెందిన వాడుగా నామినేషన్ పత్రంలో చూపించారు. బ్యాలెట్‌లో ముగ్గురు నాయకర్ పేర్లు ఉంటే ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వీరి పార్టీలు, గుర్తులు వేరైనా పేర్లు కారణంగా కన్ఫ్యూజ్ అయ్యే అవకాశం ఉంది. కావాలనే ఏవరైనా వీరితో నామినేషన్లు వేయించారా ? అని పలువరు చర్చించుకుంటున్నారు.

### ముగ్గురు ధర్మరాజులు,ఇద్దరు వాసుబాబులు

**ఉంగుటూరు** : ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గానికి వేసిన నామినేషన్లలో రెండు విచిత్రాలు చోటు చేసుకున్నాయి. జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు తన నాలుగు సెట్ల నామినేషన్లను దరఖాస్తు చేయగా మరో వ్యక్తి పెదపూడి ధర్మరాజు జాతీయ జనసేన పార్టీ తరఫున దరఖాస్తు చేశారు. నవరంగ్ కాంగ్రెస్ తరఫున పొట్ల ధర్మరాజు కూడా దరఖాస్తు చేశారు. వైసీపీ అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావు తన మూడో సెట్ నామినేషన్‌ను దరఖాస్తు చేయగా అదేపేరు ఉన్న కైకరం గ్రామానికి చెందిన పుప్పాల శ్రీనివాసరావు కూడా దరఖాస్తు చేయడం విశేషం.

### నిడదవోలు బరిలో నలుగురు 'ప్రసాద్'లు

**పెరవలి** : నిడదవోలు అసెంబ్లీ స్థానానికి నామినేషన్‌ల ఘట్టం గురువారంతో ముగిసింది. అయితే నామినేషన్‌ల పరిశీలన ఉపసంహరణ అనంతరం ఎంత మంది పోటీలో ఉంటారనేది వేచి చూడాలి. అయితే ఈ నాలుగు రోజులుగా నామినేషన్‌లు వేసినవారిలో ప్రసాద్ పేరు గల వారు నలుగురు ఉండటం విశేషం. వీరిలో ప్రధానంగా జనసేన తరుపున కందుల లక్ష్మి దుర్గేష్ ప్రసాద్ నామినేషన్ వేయగా పిరమిడ్ పార్టీ తరుపున ముక్కామల అన్నవర ప్రసాద్ నామినేషన్ వేశారు. ఇండియన్ పార్వర్డ్ బ్లాక్ పార్టీ తరుపున కస్తూరి సత్య ప్రసాద్ నామినేషన్ వేశారు. ఇండిపెండెంట్‌గా అరిగెల సత్య వరప్రసాద్ నామినేసన్ వేశారు. మొత్తం నామినేషన్‌లు వేసిన వారిలో ప్రసాద్ పేరుతో ఉన్నవారు నలుగురు ఉన్నారు.

### తెలుసుకుందాం..



## డిపాజిట్ గల్లంతంటే..?

ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థులకు డిపాజిట్లు దక్కవని ప్రసంగాల్లో వింటుంటాం.. పోటీలో ఉన్న తమ పార్టీ అభ్యర్థుల్ని గెలిపించేందుకు కేడర్‌ను ఉత్తేజపరుస్తూ ఈ విధంగా ప్రసంగి స్తుంటారు. కొంతమంది చర్చించుకున్నప్పుడు కూడా ఈ పదాన్ని వాడుతుంటారు. అసలు డిపాజిట్ గల్లంతంటే ఏమిటి..? ఎన్నికల్లో పోటీ చేయాలంటే ప్రతి అభ్యర్థి కొంత మొత్తాన్ని నామినేషన్ దాఖలు చేసే సమయంలో డిపాజిట్ కడుతుంటారు. అసెంబ్లీకి అయితే ఓసీ అభ్యర్థి రూ.10 వేలు, ఆదే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్‌గా చెల్లించాలి. పార్లమెంట్ స్థానానికి ఆయితే జనరల్ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీ అయితే రూ.12,500 చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత వచ్చిన ఓట్లు బట్టి ఈ మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తారు. ఆ సమయంలో మొత్తం పోలైన ఓట్లలో ఆరింట ఒక వంతు (16.5 శాతం) ఓట్లు సాధించిన వారికి కట్టిన డిపాజిట్ సొమ్మును వెనక్కి ఇచ్చేస్తారు. అంతకంటే తక్కువ ఓట్లు సాధించిన వారికి డిపాజిట్ సొమ్ము ఇవ్వరు. దీన్నే డిపాజిట్ గల్లంతంటారు.

-నరసాపురం

### ఎట్టెట్టా..!

## అయిన వాళ్లకే మళ్లీ కండువాలు



వేసిన వాళ్లకే మళ్లీ మళ్లీ కండువాలు వేస్తున్నారు.. రండి రండి అంటూ పార్టీలోకి కొత్తగా ఆహ్వానిస్తున్నారు. మా పార్టీలో ఇంత మందిని చేర్చుకున్నామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. సార్ వాళ్ళందరూ మీ వాళ్లేగా.. ఎందుకు లేనిపోని హడావుడి అని తెలిసిన వారు అంటే నవ్వి ఊరుకుంటున్నారు. ఇది తాజాగా వైసీపీలో జరుగుతున్న తంతు ఇప్పటి వరకు కార్యకర్తల వెనుక ఉన్న వైసీపీ సానుభూతిపరులను ముందుకు తీసుకువచ్చి పార్టీల్లో చేర్చుతు న్నట్టుగా కండువాలు కప్పుతున్నారు. వేరే పార్టీవారు చేరారంటూ ప్రచారం చేస్తున్నారు. తర్వాత ఓటర్లు దగ్గర నాయకులు నవ్వుల పాలవుతున్నారు. ఇటీవల భీమవరం మండలంలో జనసేన వార్డు సభ్యురాలికి వైసీపీ సమావేశంలో వైసీపీ కండువా వేశారు.. తరువాత ఆమె జనసేన ప్రచారంలో పాల్గొంది. దీంతో పార్టీ చేరికలు ప్రచా రానికే గానీ నిజంగా కావంటూ కొందరు గుసగుసలాడుకుంటున్నారు. - భీమవరం రూరల్

### ఇదీ సంగతి !



## ఎన్నికలొస్తే అతను బిజీ !

### కూలి డబ్బులతో నామినేషన్



సికిలి రత్నరాజు

ఆచంట, ఏప్రిల్ 25: ఎన్నికల షెడ్యూల్ వచ్చిందంటే అతడు ఎన్నికల కార్యాలయాల వద్ద ప్రత్యక్షమవుతాడు. నలుగురిని వెంటబెట్టుకుని వచ్చి నామినేషన్ వేస్తాడు. నామినేషన్ వేసిన రోజునే నేనే ఎమ్మెల్యేగా గెలుపొంది నియోజక వర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని, దేశంలోనే నెంబర్-1 నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా అంటూ మాటలతో అందరినీ నవ్విస్తాడు. ప్రతీ ఎన్నికల్లో ఆచంట నుంచి నామినేషన్ వేస్తుంటాడు.. ఎవరతను ? ఏమిటా కథ ?.. యలమంచిలి మండలం నేరేడుమిల్లికి చెందిన సికిలి రత్నరాజు కూలి పనులు చేసుకుని జీవిస్తాడు. రత్నరాజు ఐదు సంవత్సరాలకు ఒక్కసారి ఆచంటలో ప్రత్యక్షమై నామినేషన్ వేస్తాడు. గురువారం ఆచంటలో నామినేషన్ వేశాడు. తన నియోజక వర్గం పాలకొల్లు అయినప్పటికి ఆచంటలోనే ప్రతీ సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ వేయడం ఆశ్చర్యం. 2009, 2014, 2019 ఎన్నికలతో పాటు ఈ సారి కూడా నామినేషన్ వేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. షెడ్యూలు వచ్చిన వెంటనే నామినేసన్ వేసేందుకు పది వేలు సంపాదించుకుని నామినేషన్ వేస్తాడు. గతంలో నరసాపురంలో కూడా ఒకసారి నామినేషన్ వేయడం జరిగింది. దీంతో సికిలే రత్నరాజు అందరికీ సుపరిచితుడయ్యాడు. నామినేషన్ వేసిన తరువాత వారం రోజులపాటు తనకు తెలిసిన గ్రామాల్లో ఒక్కడే తన సైకిల్‌పై తిరుగుతు ప్రచారం చేసుకుంటాడు..

## ప్రచారంలో ముదునూరి తనయుడి ఎదురీత..

నరసాపురం రూరల్, ఏప్రిల్ 25: వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తండ్రి ముదునూరి ప్రసాదరాజును గెలిపించాలని తనయుడు కృష్ణంరాజు గురువారం పెదసారవ గ్రామంలో వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెళ్లిన ప్రతి ఇంటి నుంచి తాగునీటి సమస్యలపై నిలదీశారు. వందల వందలు ఖర్చు చేసి టిన్నులు తెచ్చుకుంటున్నామని చెప్పి ఇంటికి వచ్చిన నాయకులపై మండిపడ్డారు.దీంతో అవాక్కయిన తనయుడు మళ్లీ అధికారం మాకు ఇవ్వండి...మీ గ్రామంలో ట్యాంకర్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యలు తీరుస్తామని సర్దు చెప్పే ప్రయత్నం చేశారు. వెళ్లిన ప్రతి గుమ్మంలో నుంచి నీటి సమస్యలపైనే గళం విప్పడం గమనార్హం.

## మావూరమ్మకు లక్ష మల్లెల పూజ



పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 25 : స్థానిక బంగారువారి చెరువు గట్టున ఉన్న మావూరమ్మ జాతరలో భాగంగా గురువారం కర్నేన గౌరునాయుడు, రోజా రమణి, అభిషేక్, జూహీ దంపతులు లక్ష మల్లెల పూజ జరిపించారు. ఈసందర్భంగా అమ్మవారికి మహిళలు చలివిడి పానకాలు నివేదన చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ శంకరాపు శ్రీనివాస రావు, దొమ్మేటి వెంకట్రావు, మందం శ్రీను, కాస్కాని రవి, రౌతు అచ్యుతరావు, సరిదె ధనుంజయ, జి.కృష్ణ, మిరియాల సాయి, గొల్ల నాగు పాల్గొన్నారు.

## నేడు పెద్దింట్లమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠ

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 25 : స్థానిక 9వ వార్డు బోళ్ళవారి వీధిలోగల పెద్దింట్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం, శిఖర పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మానేపల్లి సత్యనారాయణ, చినబాబుల ఆధ్వర్యంలో మీసాల రామచంద్రరావు దేవి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహం, శిఖర ప్రతిష్ఠలు శుక్రవారం ఉదయం నిర్వహించనున్నారు. అనంతరం అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## నేడు ఆంజనేయ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 25 : పట్టణంలోని 20వ వార్డు సలాది వారి తోటలోని శ్రీ సీతా రామ సహిత దాసాంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ముందు 45 అడుగుల రాతి ధ్వజస్తంభాన్ని శుక్రవారం ప్రతిష్ఠించనున్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించనున్నారు.

## 2 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

భీమవరం టౌన్, ఏప్రిల్ 25: భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి మందిరంలో వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలను వచ్చే నెల 2 నుంచి 9 తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు మందిర అభివృద్ధి కమిటీ చైర్మన్ కంతేటి వెంకటరాజు, కార్యదర్శి కుక్కల బాల తెలిపారు. గురువారం ఉదయం 11.33 గంటలకు ఆలయ అర్చకులు శ్రీనివాస్ చార్యులు ఆధ్వర్యంలో కల్యాణ బ్రహ్మోత్సవాల పందిర రాటను, బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. 2వ తేదీ ఉదయం9-15 గంటలకు డి.భీమలింగేశ్వరరావు, నాగ సుప్రియ దంపతులచే స్వామి వారిని అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేయుట, 3న సాయంత్రం వార్షిక కల్యాణ మహోత్సవం, 4న కలశాభిషేకం, సాయంత్రం గరుడోత్సవం, 5న లక్ష్మి నరసింహ హోమం, 6న సాయంత్రం రథోత్సవం, 7న ఉదయం చక్ర స్నానం, ధ్వజ అవరోహణ, సాయంత్రం ఊంజల సేవ, పవళింపు సేవ, 8న ద్వాదశరాధన, 9న ఉదయం అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

## స్వామి వారి సన్నిధిలో చలివేంద్రం

కాళ్ళ, ఏప్రిల్ 25 : కాళ్ళకూరులో వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవో ఎం.అరుణ్‌కుమార్, ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఓటు ప్రాధాన్యతపై మోటార్ సైకిల్ ర్యాలీ

ఆచంట, ఏప్రిల్ 25: ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటును సద్వినియోగించుకోవాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. స్వామి నాయుడు అన్నారు. ఓటు ప్రాధాన్యతపై స్వీప్ అవగాహనా కార్యక్రమంలో భాగంగా గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మనం వేసే ఓటు ద్వారానే మంచి ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలని మీఓటే మీ భవిష్యత్తు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్వోతో పాటు తహసీల్దార్ ఐవీశెట్టి, ఎంపీడీవో పి. నరసింహ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## సెప్టిక్ ట్యాంకుల నిర్వహణపై సమీక్ష

నరసాపురం, ఏప్రిల్ 25: సెప్టిక్ ట్యాంక్‌ల నిర్వహణపై గురువారం కేంద్ర గృహ నిర్మాణశాఖ జాతీయ స్థాయిలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ సదస్సులో ఏపీ నుంచి నరసాపురం కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరావు పాల్గొన్నారు. సెప్టిక్ ట్యాంకర్ల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరిగితే బాధ్యతలకు చెల్లించే జీవిత బీమా, నిర్వహణలో గృహ యాజమానులు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అన్న దానిపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ సదస్సులో నరసాపురం మునిసిపాలిటీలో లైసెన్స్ పొందిన ఐదుగురు సెప్టిక్ ట్యాంక్ వాహనదారులు కూడా పాల్గొన్నారు. తక్కువ చార్జీలతో ట్యాంక్‌లను శుభ్రం చేసే పద్ధతి ఉన్నందున గృహ యజమానులతో తరుచూ సమావేశాలు పెట్టి వారిని చైతన్యపర్చాలని కేంద్ర అధికారులు సూచించారు.

## మలేరియాపై అవగాహన ర్యాలీ

భీమవరం రూరల్, ఏప్రిల్ 25 : ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా గొల్లవానితిప్ప పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎ.అరుణ మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలను తొలగించాలని, పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు రాకుండా నిర్మూలించవచ్చునన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

**పాలకోడేరు:** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతులుగా జీవించవచ్చునని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ రంగమనాయుడు అన్నారు. ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా పాలకోడేరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలతో పాటు, పాలకోడేరు పీహెచ్‌సీ వద్ద దోమల పై అవగాహన సదస్సుతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగమనాయుడు మాట్లాడుతూ దోమలే కదా అని అశ్రద్ధ చేయవద్దని దోమలతో అనర్థాలున్నాయని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్‌ఓ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 2 నుంచి విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ

భీమవరం టౌన్, ఏప్రిల్ 25: వేసవికాలం సెలవుల్లో విద్యార్థుల కోసం వేసవి శిక్షణ శిబిరాన్ని వచ్చేనెల 2 నుంచి పీఎస్‌ఎం బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు శ్రీవిజ్ఞా నవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు భాష, చదరంగం, చిత్రలేఖనం తదితర వాటిపై విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఉచితంగా శిక్షణ అందిస్తామని తెలిపారు.

## నీరు తోడితే ఇంజన్లు సీజ్

కాళ్ళ, ఏప్రిల్ 25 : కాళ్ళ మండలంలోని కలవపూడి, మోడీ, ఎస్సీబోస్ కాలనీ, పల్లిపాలెం, ఏలూరుపాడు గ్రామాలలోని ప్రజలు మంచినీటి గురించి ఇబ్బంది పడుతున్నారని తహశీల్దార్ ఎస్.శ్రీదేవి తెలిపారు. గ్రామాలలో చేపల చెరువులు, రొయ్యల చెరువుల యజమానులు రాబోవు పది రోజుల వరకు కెనాల్ ద్వారా ఇంజన్లు పెట్టి చెరువులకు నీరు తోడకూడదని, ఎవరైనా తోడితే వారి ఇంజన్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## లోహ క్షయం నివారణపై విస్తృత పరిశోధనలు

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 25: లోహ క్షయం నివారణపై ప్రపంచ వ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని ఏపీ నిట్ మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ రఫీ మహ్మద్ అన్నారు. ప్రపంచ లోహ క్షయం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంఎంఈ విభాగం సహకారంతో రీసెర్చ్ డిస్కషన్ అనే అంశంపై గురువారం విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ లోహాలు పర్యావరణంతో రసాయన చర్య జరపడం వల్ల లోహ క్షయం ఏర్పడుతుందన్నారు. లోహాలు, లోహ క్షయానికి గురికాకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి నిర్వహణ, మరమ్మతులు చేపట్టాలన్నారు. ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ శ్రీను, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ వంశీ, డాక్టర్ నిక్కి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ కీర్తి పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

భీమవరం క్రైం, ఏప్రిల్ 25 : లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారని టూటౌన్ పోలీస్‌లు తెలిపారు. ఎంఎస్ నగర్‌కు చెందిన కె గౌరినాయుడు (55) కొవ్వాడ పుంతకు చెందిన కె.శివ ద్విచక్రవాహనంపై బుధవారం రాత్రి ఇంటికి వస్తుండగా బైపాస్ రోడ్డులో ఉండివైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఆ సమయంలో ద్విచక్రవాహనానికి వెనుక కూర్చొన్న గౌరినాయుడు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ద్విచక్రవాహనం నడుపుతున్న వ్యక్తి గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జిజె ప్రసాద్ పేర్కొన్నారు.





నెగ్గిపూడిలోని ఆలయానికి విచ్చేసిన ఆచంట టీడీపీ కూటమి అభ్యర్థి పితాని.. ప్రచారం చేస్తున్న పితాని కోడలు నాగసాహితి

# పితాని కుటుంబ సభ్యుల ప్రచారం

పెనుగొండ, ఏప్రిల్ 25: రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి పితాని సత్యనారాయణ, బీజేపీ ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస వర్మకు ఓట్లు వేసి గెలిపించాలని పితాని తనయుడు భాను అన్నారు. పెనుగొండలో గురువారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కటికిరెడ్డి నానాజీ, కొండవీటి శ్రీనివాసరావు, గుర్రాల సూరిబాబు, వేండ్ర రాము, బండారు నాయుడు, మద్దింశెట్టి వెంకటేష్, గిరే నాగరాజు, పోడూరి సత్యనారాయణ, గాజుల శ్రీనివాసు పాల్గొన్నారు.

**పెనుమంట్ర:** మాముడూరులో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పితాని సత్యనారాయణ విజయాన్ని కోరుతూ ఆయన కోడలు నాగ సాహితి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించారు. గ్రామంలో తాగునీటి చెరువు పచ్చగడ్డిలా నిండి పోయిందని మహిళలు పితాని నాగ సాహితికి మొరపెట్టుకున్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు మాలతిలత, టీడీపీ మహిళలు పాల్గొన్నారు.

### అమ్మవారికి పితాని పూజలు

పెనుమంట్ర, ఏప్రిల్ 25 : నెగ్గిపూడిలోని శ్రీ వనవులమ్మ కనకదుర్గమ్మ అమ్మవారిని టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ దర్శించుకున్నారు. జాతర పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుబ్బల నాగేశ్వరరావు, పాల ప్రసాద్, పిల్లి గోపి, వెలగల మల్లికార్జున్ రెడ్డి, చిర్ల శ్రీనివాసరెడ్డి, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.





తాడేపల్లిగూడెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బొలిశెట్టి, వలవల.. పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొలిశెట్టి

# వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 25: ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ విమర్శించారు. గురువారం పట్టణంలోని 14, 17 వార్డుల్లో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ మాయమాటలు, మోస పూరిత హామీలిచ్చి వైసీపీ ప్రజల్ని మోసం చేసిందన్నారు. గొర్రెల శ్రీధర్, వర్తనపల్లి కాశి, పట్నాల రాంపండు, బండి పెద్దిరాజు పాల్గొన్నారు.

- వైసీపీ అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మాజీ కౌన్సిలర్ పైబోయిన వైదేహి, కర్ణం శ్రీనుతో పాటు పలువురు బొలిశెట్టి సమక్షంలో జనసేనలో చేరారు. వీరికి కండువా కప్పి బొలిశెట్టి పార్టీలోకి ఆహ్వానించారు.

### టిడ్‌కో గృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 25: టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం పేదలను అద్దె ఇళ్లకే పరిమితం చేసిందని, కూటమి అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులందరికీ ఇళ్లు ఇస్తామని కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. తాడేపల్లిగూడెం మండలం ఎల్. అగ్రహారంలోని టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన నాయకులు మారం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





తాడేపల్లిగూడెం మండలంలో పర్యటిస్తున్న బీజేపీ లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థి శ్రీనివాస్ వర్మ, తాడేపల్లిగూడెం జనసేన అభ్యర్థి బొలిశెట్టి, టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి.. భీమవరంలో ప్రచారం చేస్తున్న వెంకటేశ్వరి దేవి

# అభివృద్ధి చేసే బాధ్యత మాది: శ్రీనివాస్ వర్మ

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 25: నరసాపురం పార్లమెంట్ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీలతో కలసి ప్రచారం చేశారు. ఒక్కసారి ఆశీర్వదించండి. నర్సాపురం పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించండి. అభివృద్ధి చేసి చూపిస్తాము అంటూ శ్రీనివాస్ వర్మ ప్రజలను కోరారు. కూటమికి మద్దతుగా రూరల్ మండంలోని బంగారు గూడెం, వీరంపాలెం, పట్టింపాలెం గ్రామాల్లో యువత, మహిళలు నినాదాలు చేశారు. కేంద్రంలో ప్రధాని మోదీ నాయకత్వం, రాష్ట్రంలో చంద్రబాబు సమర్థ పాలన, పవన్ కల్యాణ్ పవర్‌తో రాష్ట్రాన్ని, జిల్లాను, తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు. ఐదేళ్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. గ్రామాల్లో అభివృద్ధి లేకుండా పోయింది. పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. సర్పంచ్‌లకు గౌరవం లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలు ఇబ్బందులు పడ్డారు. బీసీలను జగన్ దగా చేశారు. ఎస్‌సీ వర్గాల సంక్షేమ పథకాలను రద్దు చేసి వంచించారన్నారు.

### శ్రీనివాస వర్మ సతీమణి వెంకటేశ్వరి ప్రచారం

భీమవరం టౌన్, ఏప్రిల్ 25 : ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఎంతో పురోగమిస్తుందని, మరోసారి ఆయన ప్రధానమంత్రి అవ్వాలంటే ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని నరసాపురం లోక్‌సభ బీజేపీ ఉమ్మడి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస వర్మ సతీమణి భూపతి రాజు వెంకటేశ్వరి దేవి ఓటర్లను అభ్యర్థించారు. మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డు, గొల్లలకోడేరు పంచాయతీ పరిధిలోని టౌన్ షిప్ సంజన టవర్స్‌లో గురువారం నాడు ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వ పాలన వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె పేర్కొంటూ ఎంపీ అభ్యర్థి శీనివాస్ వర్మకు కమలం గుర్తుపైనే ఓటు వేయాలని కోరారు





.పైడిపర్రులో ప్రచారం నిర్వహిస్తున్న ఆరిమిల్లి... అత్తిలిలో ప్రచారంలో కృష్ణ తులసి

# ఫ్యాన్ రెక్కలు విరిచేద్దాం, సుపరిపాలన తెచ్చుకుందాం

తణుకు, ఏప్రిల్ 25: రానున్న ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు విరిచి, వైసీపీని ఇంటికి పంపించాలని తణుకు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం పైడిపర్రులోని 32, 33 వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంలో తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రజలు ఎదురొచ్చి మరీ వివరిస్తున్నారు. ఒక్క చాన్సు ఇచ్చి మోస పోయామని, మళ్లీ ఆ పని చేయబోమని, ఆరిమిల్లిని గెలిపించుకుంటామని చెబుతున్నారు. పైడిపర్రులో టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిని గుర్తు చేశారు. ఐదేళ్ళు అధికారంలో ఉన్న కారుమూరి నాగేశ్వరరావు సొంత సంపాదన, ఆధిపత్యం కోసమే పాకులాడారన్నారు. కనీసం డ్రెయిన్‌ల సమస్య తీర్చలేదని చెప్పారు. రూ. 500 ఉండే ఇంటి పన్ను రూ. 1500కు చేరిందని రాధాకృష్ణ గుర్తు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మోపిదేవి శివ, సరిమల్లె సాంబశివరావు, పితాని గణేష్, కొమ్మిరెడ్డి శ్రీనివాసు, ప్రసాదు, బొద్దాల రాజీ, మారిశెట్టి మురళి, పంగం రాంబాబు, గంధం పెదరంగ, శ్రీను పాల్గొన్నారు.

### టీడీపీకి మహిళల్లో ఆదరణ : కృష్ణతులసి

నియోజకవర్గంలో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నదని, టీడీపీకి మహిళల్లో ఆదరణ చాలా బాగుందని ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి అన్నారు. గురువారం అత్తిలి మండలంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. చంద్రబాబు, పవన్, మోదీ వల్లే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రజలు బలంగా నమ్ముతున్నారని వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆనాల ఆదినారాయణ, ఆళ్ళ సత్యనారాయణ, పోలిశెట్టి చంటి, పూతినీడి శ్రీనివాసు, వర్రి శ్రీను, ప్రసాదు, కొనకళ్ల విజయలక్ష్మి, మద్దాల రాంబాబు, దాసం ప్రసాదు, దిరిసాల వెంకట్, అయినంపూడి శ్రీదేవి పాల్గొన్నారు.

# మంచిని ఆశీర్వదించండి: అంజిబాబు



పెన్షనర్‌లతో జనసేన కూటమి అభ్యర్థి అంజిబాబు

భీమవరం టౌన్, ఏప్రిల్ 25: ప్రజలకు సేవకునిగా ఉంటాను. మంచే చేస్తాను. గడచిన ఐదేళ్లమాదిరిగా నియోజకవర్గంలో కక్షపూరిత రాజకీయాలుండవు. సామాన్యులకు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం. మరో అవకాశం ఇవ్వండి. భీమవరం నియోజకవర్గంలో కూటమికి మద్దతు ఇవ్వండి. గ్రామాల్లో మంచినీరు అభివృద్ధి, శివారు ప్రాంతాలకు సక్రమంగా సాగునీరు అందించేబాధ్యత మాది. పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి అత్యధిక నిధులు తీసుకొస్తామని భీమవరం ఎన్డీఏ కూటమి జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం రూరల్ మండలంలోని నాగిడిపాలెం, దెయ్యాలతిప్ప, వెంటతిప్ప, కోమటితిప్ప తదితర గామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. గోదావరి నుంచి నేరుగా పైప్‌లైన్ ప్రాజెక్ట్ ద్వారా ప్రతి గ్రామానికి మంచినీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రౌడీ రాజకీయాలను సాగనంపాలని విజ్ఞప్తి చేశారు. అవినీతి, అక్రమాలు, మట్టి మాఫియాకు మట్టికరిపించాలని కోరారు. నామినేషన్ రోజున స్వచ్ఛందంగా వేలాదిమంది తరలివచ్చి మద్దతు ఇచ్చారంటే జనాల్లో మార్పు ఎంతబలీయంగా ఉందో అర్థమవుతోంది. ప్రజలు రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. సంక్షేమంతోకూడిన అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నారు. భీమవరం నియోజకవర్గంలో గత ఐదేళ్లలో అభివృద్ధికి నోచుకోలేదు. జాతీయరహదారులకు మోకాలడ్డారు. జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమిని గెలిపించి అభివృద్ధికి సహకరించండి. భీమవరంలో నియోజకవర్గ శాసనసభ్యునిగా తనకు గ్లాస్ గుర్తుపై ఓటేయండి. ఎంపీ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాస్‌వర్మకు కమలంపై ఓటేసి గెలిపించాలని అంజిబాబు విజ్ఞప్తి చేశారు. భీమవరంలో విశ్రాంత ఉద్యోగులు అంజిబాబుకు సంఘీభావం తెలిపారు. పెన్షనర్‌ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అంజిబాబు భరోసా ఇచ్చారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెంటపాడు, ఏప్రిల్ 25: మరమ్మతుల నిమిత్తం మండలంలోని పెంటపాడు, ఆకుతీగపాడు, యానాలపల్లి, పరిమెళ్ళ గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రజలంతా సహకరించాలని కోరారు.

**భీమవరం రూరల్:** శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తాడేరు, యమునేపల్లి, కొత్రపాడు, బేతపూడి, కరుకువాడ, గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. పెదగరువు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో జీవీఐటి కాలేజీ, తుందుర్రు, జొన్నలగరువు, దూసనపూడి, మత్స్యపురి పాలెం, కమతాలపల్లి, బాలేపల్లి గ్రామాలతో పాటు తుందుర్రు గోదావరి మెగా ఆక్వాఫుడ్ పార్క్‌నకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## వేణుగోపాలస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ

ఆకివీడు రూరల్ ఏప్రిల్ 25: పెదకాపవరంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకూర్మనాథ వేణుగోపాలస్వామి ఆలయం పునఃప్రతిష్ఠా కార్యక్రమం గురువారం జరిగింది. సుమారు 500 సంవత్సరాల క్రితం వెలిసినదిగా చెబుతారు. పురాతన గుడి కావడంతో వర్షపు నీరు చేరుతుండటంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈనెల 23వ తేదీ నుంచి పూజాది, హోమ కార్యక్రమాలు ప్రారంభమై స్వామివారు, ధ్వజం, శిఖర, జయ, విజయ ప్రతిష్ఠలు నిర్వహించారు.

## సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ



మొగల్తూరు, ఏప్రిల్ 25: మొగల్తూరు పంచాయతీ గరువు పల్లవపాలెం రహదారిలో పునః నిర్మాణం చేసిన సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి నూతన విగ్రహాలను శుక్రవారం ప్రతిష్ఠించారు. ఈ ఆలయాన్ని కృష్ణాజిల్లా గొల్లపాలెంకు చెందిన సాదనాల వెంకట సత్యనారాయణ కృష్ణ కుమారీల కుమారులుచే పునఃనిర్మించిన ఈ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. గణపతి హోమం నిర్వహించి స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

## రాష్ట్రంలో వార్ వన్ సైడ్... సీఎం చంద్రబాబే

నరసాపురం రూరల్, ఏప్రిల్ 25: గెలుపు కోసం వైసీపీ ఎన్ని హామీలు, కుత్రంతాలు, ప్రలోభాలు పెట్టినా గెలుపు వార్ వన్‌సైడ్ అని, ముఖ్యమంత్రి అయ్యేది చంద్రబాబేనని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. గురువారం కూటమి అభ్యర్థులు బొమ్మిడి నాయకర్, శ్రీనివాసవర్మలను గెలిపించాలంటూ మండలంలోని బియ్యపుతిప్ప గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ కన్వీనర్ మేకల సతీశ్, వాతాడి ఉమా, వనమాల శ్రీనివాస్, పందు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు పంపిణీ



పెదకాపవరం జడ్పీపాఠశాలలో ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

ఆకివీడు రూరల్ ఏప్రిల్ 25 : పెదకాపవరం జడ్పీపాఠశాలలో పదవ తరగతి చదువుతూ వృత్తివిద్యా కోర్సులు, ఐటి, ఐటిఇఎస్ పూర్తి చేసిన 19 మంది విద్యార్థులకు పాఠశాల మెంటార్, సిఎస్ ఓఎస్‌డి కఠారి వెంకటకృష్ణ సర్టిఫికెట్లు అందజేశారు. పదవతరగతి పరీక్షా ఫలితాలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. 524మార్కులు సాధించి పాఠశాల ఫస్ట్‌గా నిలిచిన పి.మహాలక్ష్మిని పుష్పగుచ్ఛమిచ్చి అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బందెల కాళహస్తీశ్వరుడు, ఉపాధ్యాయులు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## 28న భగవద్గీత పోటీలు

ఆకివీడు, ఏప్రిల్ 25: హైందవీ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే భగవద్గీత పోటీలో పాల్గొనదలచిన పిల్లలు ఈ నెల 27న ఈ నెంబరుకు 9553809850 ఫోన్ చేసి పేరు రిజిస్టర్ చేయించుకోవాలని అధ్యక్షుడు లంక జలదుర్గా ప్రసాద్ గురువారం తెలిపారు. మాదివాడ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన పిల్లలకు మే 2న బహుమతులు అందిస్తామన్నారు.

## 18 మంది వలంటీర్ల రాజీనామా

మొగల్తూరు, ఏప్రిల్ 25: మొగల్తూరు మంలంలో పలు గ్రామాలకు చెందిన వలంటీర్లు రాజీనామాలు చేసినట్టు ఎంపీడీవో వి.బాబ్జిరాజు తెలిపారు. కాళీపట్నం తూర్పు నుంచి ఒకరు, జగన్నాధపురం నుంచి ఒకరు, కెపిపాలెం నార్త్ నుంచి 16 మంది తమ రాజీనామాలను ఆయా గ్రామ కార్యదర్శులకు అందచేశారని ఎంపీడీవో తెలిపారు. ఈనెల 22వ తేదీన 29 మంది రాజీనామా చేయగా గురువారం మరో 18 మంది రాజీనామాలు చేశారు.

## సీఎం వరికి





పాలకొల్లులో నిమ్మల, అంగరకు హారతి.. అప్పన్న చెర్వులో సూర్యకుమారి ప్రచారం

# ప్రజల క్షేమం కోసమే నా తపన: నిమ్మల

పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 25: పాలకొల్లు నియోజకవర్గ ప్రజల క్షేమం కోసమే నేను తపన పడుతుంటానని పాలకొల్లు టీడీపీ కూటమి అభ్యర్థి నిమ్మల రామానాయుడు అన్నారు. 24, 25వ వార్డుల్లో గురువారం ఆయన ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. మూడో సారి పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని ఓటర్లును అభ్యర్థించారు. ఎమ్మెల్యే నిమ్మల తో పాటు ఇంటింటికీ పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉన్నమట్ల కబర్ధి పాల్గొన్నారు.

### అప్పన్నచెర్వులో సూర్యకుమారి ప్రచారం

పోడూరు, ఏప్రిల్ 25: అప్పన్నచెర్వు గ్రామంలో ఎమ్మెల్యే రామానాయుడు సతీమణి సూర్యకుమారి ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే రామానాయుడు అప్పన్నచెర్వు గ్రామంలో అనేక సిమెంట్ రోడ్లు వేసి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దారన్నారు. ఎంపీటీసీ విప్పర్తి శారద, మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రంశెట్టి పద్మారావు, జనసేన మండల అధ్యక్షుడు పితాని వెంకట్ పాల్గొన్నారు.

# గెలిపించండి.. అభివృద్ధి చేస్తా: రఘురామ

పాలకోడేరు, ఏప్రిల్ 25: ఉండి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే భాగ్యాన్ని తనకు కల్పించాలని కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. గొల్లలకోడేరు, గరగపర్రు, కోరుకొల్లు, మొగళ్ళు, మైపా గ్రామాల్లో ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజుతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. మొగళ్ళు, కోరుకల్లు రహదారి వెంబడి ఆటోలో ప్రయాణం చేస్తున్న జనాన్ని చూసిన రఘురామ కృష్ణరాజు ఆయన వాహనం దిగి టీడీపీని గెలిపించాలంటూ అభ్యర్థించారు. ఈయన వెంట ఉండి జనసేన ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, ఉండి బీసీ టీడీపీ నాయకుడు కామన రాంబాబు, కమ్మిలి రాంబాబు, గాదిరాజు సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

### రఘురామ కుమార్తె ప్రచారం

ఉండి, ఏప్రిల్ 25: ఉండి టీడీపీ కూటమి అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణ రాజు విజయం కోసం ఆయన కుమార్తె ఇందు ప్రచారం చేశారు. గురువారం ఉండిలో గౌడపేట, సాలిపేట, రాజుల పేట, సంతమార్కెట్ ఏరియాలో ఆమె ముమ్మర ప్రచారం చేశారు.



దివ్యాంగులకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న సీతారామలక్ష్మి

## టీడీపీలో దివ్యాంగులు చేరిక

భీమవరం అర్బన్, ఏప్రిల్ 25 : దివ్యాంగులకు రానున్న ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి రూ.6వేల పెన్షన్ అందించనున్నదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం పట్టణ టీడీపీ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మైలబత్తుల ఐజాక్ బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 30 మంది దివ్యాంగులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు వేండ్ర శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బర్రె నెహ్రూ నాయకులు కొండ్రు శ్రీనివాస్, గంటా త్రిమూర్తులు, చల్లబోయిన గోవింద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## స్వతంత్ర అభ్యర్థిగా దొరబాబు నామినేషన్



భీమవరం అర్బన్, ఏప్రిల్ 25: నరసాపురం పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా అద్దంకి దొరబాబు గురువారం భీమవరం జిల్లా కలెక్టరు కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన కాంగ్రెసు పార్టీ తరపున నరసాపురం పార్లమెంటు కోసం ప్రయత్నించారు. సీటు దక్కక పోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్టు దొరబాబు తెలిపారు.

## మజ్జిగ, మంచినీటి చలివేంద్రం ప్రారంభం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 25: వాసవి క్లబ్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మజ్జిగ, మంచినీటి చలి వేంద్రాన్ని క్లబ్ రీజియన్ చైర్మన్ చక్కా శ్రీనివాసరావు ప్రారంభించారు. వేసవి చివరి వరకు చలివేంద్రంలో మజ్జిగ, మంచినీరు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ముందుగా ఆర్యవైశ్య వర్తక సంఘం భవనంలో నిరుపేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.